PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 175 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 09 రూ - 03/- ఆదివారం 22 జూన్ 2025

**22వేల మంది రైతులకు రైతు భరోసా ఎగవేత**




**హైడ్రా అంటే కూల్చివేతలు కాదు**










☛ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుక ☛విశాఖ తీరంలో యోగాసానాలు వేసిన లక్షలాది జనం ☛ప్రత్యేక అతిథిగా హాజరై యోగాసనాలు చేసిన ప్రధాని ☛యోగా ప్రపంచాన్ని ఏకం చేసిందని మోడీ వ్యాఖ్య

# గిన్నిస్ రికార్డును సాధించిన యోగాంధ్ర

**విశాఖ,జూన్ 21 (పీసీడబ్ల్యూ న్యూస్):** విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యారు. లక్షలాదిగా జనం తరలివచ్చి ఉత్సాహంగా యోగాలో పాల్గొన్నారు. కిలోటర్ల మేర యోగా చేస్తూ ఉత్సాహంగా కనిపించారు. విశాఖ ఆర్కే బీచ్ వేదికగా అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకగా ముగిసింది. లక్షలాది మంది సాగర తీరానికి చేరుకుని యోగాసనాలు వేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు సహా పలువురు ప్రముఖులు మిగతావి 2లో

# భ్రష్టుపట్టిన రెవెన్యూ వ్యవస్థ ప్రాక్షాళన


**- అధికారులతో సమీక్షలో మంత్రి పొంగులేటి**



**హైదరాబాద్,జూన్ 21 (పీసీడబ్ల్యూ న్యూస్):** భారాస ప్రభుత్వ హయాంలో భ్రష్టుపట్టిన రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేసే పనిలో ఉన్నట్టు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ధరణితో సర్వనాశనం చేశారని అన్నారు. ఇప్పుడు అన్నీ సవరించి సక్రమ మార్గంలో పెట్టే ప్రయత్నంలో ఉన్నామని అన్నా రు. రెవెన్యూ సదస్సులు ముగిసిన సందర్భంగా శనివారం అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ఏప్రిల్ 14న భూ భారతి చట్టాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారని, దశలవారీగా ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చినట్టు పేర్కొన్నారు. మొదటి విడత ఏప్రిల్ 17 నుంచి 30వ తేదీ వరకు నాలుగు మండలాల్లో, రెండో విడతలో మే 5 నుంచి 28 వరకు 28 మండలాల్లో, మూడో విడతలో ఈనెల 3 నుంచి 20 వరకు మూడో విడతలో సదస్సులు నిర్వహించినట్లు వివరిం చారు. ఈ మూడు విడతల్లో రాష్ట్ర వ్యాప్తంగా 593 మండలాల్లో 10,725 రెవెన్యూ మిగతావి 2లో

# జనాభా పెరుగుదలే అభివృద్ధికి ఆటంకం

**- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి**



**న్యూఢిల్లీ, జూన్ 21 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఆర్థికంగా దేశం బలపడకపోవడానికి దేశ జాభా కారణమని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అభిప్రాయపడ్డారు. తలసరి ఆదాయం విషయంలో ప్రపంచంలో తొలి పది దేశాల్లో భారత్ ఎందుకు లేదని అడిగిన ఓ ప్రశ్నకు స్పందిస్తూ.. దేశ జనాభా ఇందుకు కారణమన్నారు. జనాభా నియంత్రణను భాషా లేదా మతపరమైన సమస్యగా కాకుండా ఆర్థిక మిగతావి 2లో

## ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడులు

# సమర్థనీయం కాదు

**☛భారత్ దౌత్యనీతిని ప్రదర్శించాలి : సోనియా**



**న్యూఢిల్లీ, 21 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడిని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ఖండించారు. మోడీ ప్రభుత్వ వైఖరిపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్, ఇరాన్ విషయంలో భారత్ మౌనం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇరాన్ - ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతపై సోనియా గాంధీ స్పందించారు. భారత్ చారిత్రక నైతిక స్థైర్యాన్ని కోల్పోయిందని.. మానవ హక్కుల ఉల్లంఘనలపై మౌనం బాధాకరమన్నారు. అంతర్జాతీయ మానవతా బాధ్యతను గుర్తు చేశారు. ఈ మేరకు సోనియా గాంధీ ఓ వ్యాసం రాశారు. దాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సోషల్ మీడియా ఎ÷-లాట్‌ఫామ్‌లో పంచుకున్నారు. ఇరాన్ భారతదేశానికి మిత్ర దేశమని, ఇరు దేశాల మధ్య సంబంధాలు ఎల్లప్పుడూ బాగానే ఉన్నాయని సోనియా గాంధీ ఆ వ్యాసంలో పేర్కొన్నారు. ఇరాన్– భారత్ మధ్య స్నేహానికి ఉదాహరణగా.. 1994 నాటి జమ్మూ కశ్మీర్ సమస్యను గుర్తు చేశారు. 1994లో ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మిగతావి 2లో

## పాడి కౌశిక్ రెడ్డికి

# ఊరట

**- షరతులతో కూడిన బెయిల్ మంజూరు**



**వరంగల్,జూన్ 21 (పీసీడబ్ల్యూ న్యూస్):** హుజూరాబాద్ భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి ఊరట లభించింది. కౌశిక్‌రెడ్డి రిమాండ్‌ను తిరస్కరించిన న్యాయస్థానం అతనికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. క్వారీ యజమానిని బెదిరించిన కేసులో పోలీసులు అతన్ని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో వైద్య పరీక్షల అనంతరం కాజీపేట రైల్వే కోర్టులో మిగతావి 2లో

# దేశంలో తెలంగాణలోనే స్టార్టప్ విజయవంతం

☛నాడు అన్ని కంపెనీలను సులువుగా అనుమతులు
☛దేశంలో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉంది : కేటీఆర్



**హైదరాబాద్,జూన్ 21 (పీసీడబ్ల్యూ న్యూస్):** స్వతంత్ర భారత చరిత్రలోనే విజయవంతమైన స్టార్టప్ స్టేట్ తెలంగాణ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజల జీవితాలను మార్చాలన్న సంకల్పం ఉన్న నాయకుడు అధికారంలో ఉంటే ఏం జరుగుతుందో తెలియడానికి తెలంగాణనే నిదర్శనం అని అన్నారు. లండన్ ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ సదస్సులో తెలంగాణ విజయగాథను కేటీఆర్ వినిపించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. దశాబ్దాల పోరాటం తర్వాత 2014లో తెలంగాణ ఏర్పడింది. స్వతంత్ర భారతంలో అద్భుతమైన ఆర్థిక పురోగతి, ప్రగతిని చూపించిన రాష్ట్రం తెలంగాణ. అహింసా యుతంగా జరిగిన ఒక మహా అద్భుత పోరాటం తెలంగాణ ఉద్యమం. తెలంగాణ విజయాన్ని కేవలం అంకెలతో మాత్రమే చెప్పుకుంటే సరిపోదు. ఆత్మగౌరవం, పట్టుదలకు ప్రతిరూపంగా చెప్పుకోవడంతో పాటు లక్షలాది మంది భారతీయులకు భవిష్యత్తుపై భరోసాను ఇచ్చిన మిగతావి 2లో

## హామీ మేరకు రైతుభరోసా

# నిధులు విడుదల

**- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి**



**హైదరాబాద్,జూన్ 21 (పీసీడబ్ల్యూ న్యూస్):** రైతుల ఖాతా ల్లో రైతు భరోసా నిధుల జమ కొనసాగుతోంది. ఇచ్చిన హామీ మేరకు నిధులును జమ చేస్తున్నా మని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో ముందుంటుందని అన్నారు. అన్నదాతలకు సకాలంలో వ్యవసాయ పెట్టుబడి అందేలా చేస్తున్నామని అన్నారు. శనివారం 9 ఎకరాల వరకు రైతు భరోసా నిధులు విడుదలయ్యాయి. ఆరు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ.7,770.83 కోట్లు జమ చేసినట్టు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. భారాస హయాంలో రైతుబంధు నిధుల విడుదల నెలలపాటు సాగేదని విమర్శించారు. 'మేం వేగంగా రైతు భరోసా ఇస్తుంటే భారాస నేతలు డ్రామాలు చేస్తున్నారు. ఓఆర్ఆర్ లోపల సాగు భూములను గుర్తించి వాటికీ రైతు భరోసా ఇస్తాం. పంట సాగయ్యే ప్రతి భూమికి రైతు భరోసా చెల్లిస్తాం. కోతల ప్రభుత్వమనే భారాస పార్టీని ప్రజలు తిరస్కరించారు. భారాస ప్రభుత్వం రుణమాఫీని ఎన్నేళ్లలో చేసిందో గుర్తు చేసుకోవాలి' అని తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

## జనాభా పెరుగుదలే అభివృద్ధికి ఆటంకం

(మొదటి పేజీ తరువాయి)

సమస్యగా చూడాలన్నారు. చాలా అభివృద్ధి జరుగుతున్నా.. ఫలితాలు మాత్రం అందరికీ అందడం లేదన్నారు. ఇందుకు జనాభా పెరుగుదలే కారణమన్నారు. గత రెండు పర్యాయాల్లో మోదీ ప్రభుత్వం సాధించిన అనేక విజయాలను ఈ సందర్భంగా గడ్కరీ ప్రస్తావించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తన పాత్రపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గత 11 ఏళ్లలో చూసింది కేవలం న్యూస్ రీల్ మాత్రమేనని, అసలైన సినిమా ఇంకా మిగిలే ఉందని వ్యాఖ్యానించారు. ఏదేమైనా తాను చేయాల్సిన పనులను పార్టీ నిర్ణయిస్తుందని, ఏ బాధ్యతలు అప్పగించినా నిర్వర్తించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. 'ఇప్పటివరకు చూసిందంతా న్యూస్ రీల్ మాత్రమే. అసలైన సినిమా ఇంకా ప్రారంభం కాలేదు. కార్యకర్తలు ఏం చేయాలి, బాధ్యతలు ఏంటనే విషయాన్ని పార్టీ నిర్ణయిస్తుంది. పార్టీ అప్పగించిన బాధ్యతలను నేను నిర్వర్తిస్తా. ఇటీవల రోడ్ల పనుల కంటే వ్యవసాయం ఇతర సామాజిక కార్యక్రమాలపై నేను ఎక్కువగా దృష్టి సారిస్తున్నా' అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. 11ఏళ్ల మోదీ పాలన గురించి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన గడ్కరీ.. విదర్భలో రైతుల ఆత్మహత్యలను ఆపేందుకు కృషి చేయాలన్నదే తన కోరిక అన్నారు.

## భ్రష్టుపట్టిన రెవెన్యూ వ్యవస్థ ప్రాక్షాళన

(మొదటి పేజీ తరువాయి)

సదస్సులు నిర్వహించగా 8.58 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు మంత్రి తెలిపారు. అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 67వేలు, భద్రాద్రిలో 61వేలు, వరంగల్‌లో 54 వేలు, భూపాలపల్లిలో 48వేలు, నల్గొండలో 42 వేల దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సులకు ముందురోజే ఆయా గ్రామాల్లో రైతులకు ఉచితంగా దరఖాస్తులు ఇచ్చామని, ఎమ్మార్వోల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి రెవెన్యూ అధికారులే ప్రజల వద్దకు వచ్చి ఎలాంటి రుసుము లేకుండా దరఖాస్తులను స్వీకరించారని వివరించారు. స్వీకరించిన వాటికి రశీదులు అందజేయడం జరిగిందని, వచ్చిన దరఖాస్తుల్లో ఇప్పటివరకు 3.27 లక్షల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. మిగిలిన వాటిని కూడా త్వరితగతిన ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

## పాడి కౌశిక్ రెడ్డికి ఊరట

(మొదటి పేజీ తరువాయి)

హాజరుపర్చారు. 41ఏ నోటీసులు ఇవ్వకుండా అరెస్టు చేశారని కౌశిక్‌రెడ్డి తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ఇరు వైపులా వాదనలు విన్న న్యాయమూర్తి.. కౌశిక్‌రెడ్డికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. భారాస నేతల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని మాజీ ఎంపీ వినోద్ కుమార్ ఆరోపించారు. కాజీపేట కోర్టు.. కౌశిక్‌రెడ్డి రిమాండ్‌ను తిరస్కరించిన అనంతరం భారాస నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజా సమస్యలపై కౌశిక్‌రెడ్డి పోరాడుతున్నందుకే అక్రమ కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. రెండేళ్ల క్రితం కేసులో అరెస్టు చేసి, కుట్ర పూరితంగా సెక్షన్లు మార్చారని ఆరోపించారు. పోలీసులు పెట్టిన సెక్షన్లు సరైనవి కావని తమ న్యాయవాదులు వాదించారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించినా కోర్టులో న్యాయం జరిగిందన్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా తామంతా ప్రజల్లో ఉండి పోరాడుతామన్నారు.

## 500 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు విదేశీ విద్య : పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్,జూన్ 21 (పీసీడబ్ల్యూ న్యూస్):** అంబేద్కర్ ఓవర్సీస్ పథకం కింద విదేశాల్లో విద్యనభ్యసించేందుకు ఇక నుంచి ఏడాదికి 500 మందికి అవకాశం కల్పించనున్నారు. అందుకు సంబంధించిన ఫైలుపై తెలంగాణ షెడ్యూల్డ్ కులాలు, గిరిజన అభివృద్ధి, దివ్యాంగుల, మైనార్టీ సంక్షేమ శాఖల మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్ తొలి సంతకం చేశారు. సచివాలయంలో 2వ అంతస్తులోని తన చాంబర్‌లో మంత్రిగా శనివారం ఉదయం ఆయన బాధ్యతలను స్వీకరించారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా 844 మంది దివ్యాంగులకు రూ.5 కోట్లతో స్వయం ఉపాధి కల్పించే యూనిట్ల మంజూరు, అదేవిధంగా దివ్యాంగులకు స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసి తద్వారా 2367 మందికి 3.50 కోట్లను పంపిణీ చేసే ఫైలుపై సంతకం చేశారు. అంబేద్కర్ ఓవర్సీస్ స్కీమ్ ద్వారా ఇప్పటివరకు ఏటా 210 మంది ఎస్సీ విద్యార్థులకు విదేశాల్లో ఉన్నతవిద్యా అభ్యాసానికి రూ.20 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఇప్పుడు విద్యార్థుల సంఖ్యను 500 లకు పెంచారు. అందుకు సంబంధించిన ఫైలుపై కూడా మంత్రి సంతకం చేశారు. అదేవిధంగా మేడారం జాతరలో ఏర్పాట్లకు సంబంధించిన రూ.45 కోట్ల పనులకు, రూ.79.61 కోట్లతో గిరిజన విద్యాలయాల మరమ్మతు పనులకు, మినీ గురుకులాల నిర్వహణకు 17.18 కోట్లను, అదేవిధంగా ఐఐటీ, నీట్‌లో ర్యాంకులను సాధించిన 100 మంది గిరిజన విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందించేందుకు ఆమోదం తెలిపారు. అనుమతులు మంజూరు చేశారు. బాధ్యతలను స్వీకరించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు మంత్రులు పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, సంజయ్‌కుమార్, ధర్మపురి నియోజకవర్గ కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు.

## గిన్నిస్ రికార్డును సాధించిన యోగాంధ్ర

(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. యోగా ప్రాముఖ్యతను తెలియజేస్తూ.. ప్రపంచ రికార్డులు నెలకొల్పడమే లక్ష్యంగా యోగా కార్యక్రమాన్ని ఏపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రధానికి సీఎం చంద్రబాబు జ్ఞాపికను బహూకరించారు. అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ... 'అందరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. యోగా ప్రపంచ దేశాలను ఏకం చేసిందని, ఆ ఘనత భారత్‌కు దక్కిందన్నారు. యోగా దినోత్సవ ప్రతిపాదనకు 175 దేశాలు మద్దతిచ్చాయి. 175 దేశాల్లో యోగా చేయడం సాధారణ విషయం కాదు. యోగా అనేది మానవతను పెంచే సామూహిక ప్రక్రియ అన్నారు.. గత పదేళ్లలో కోట్ల మంది జీవితాల్లో యోగా వెలుగులు నింపింది. గ్రామగ్రామాల్లో యువకులు యోగాను అనుసరిస్తున్నారు. యోగాకు వయసుతో పనిలేదు.. యోగాకు హద్దులు లేవు' అని మోదీ అన్నారు. 'ప్రకృతి సౌందర్యానికి, ప్రగతికి చిరునామా విశాఖపట్నం. ప్రకృతిలో మనిషి భాగస్వామి అని యోగా గుర్తు చేస్తుంది. యోగాతో వ్యక్తిగత క్రమశిక్షణ అలవడుతుంది. యోగా ద్వారా నేను అన్న భావన మనంగా మారుతుంది. మనం అన్న భావన మానవత్వాన్ని పెంచుతుంది. ప్రపంచంలో అశాంతి, అస్థిరత పెరుగుతున్నాయి. యోగా వల్ల శాంతి స్థిరత్వం సాధించవచ్చు' అని మోదీ పేర్కొన్నారు. నెలన్నర రోజుల్లో యోగాంధ్రను విజయవంతం చేయడంలో మంత్రి లోకేశ్ పాత్ర కీలకమైందని.. కొత్త కార్యక్రమాల రూపకల్పనలో ఆయన చొరవ ప్రశంసనీయమని ఈ సందర్భంగా మోదీ కొనియాడారు. 'యోగా కేవలం వ్యాయామం కాదు.. అదొక జీవన విధానం. ఈ ఏడాది విశాఖలో యోగ దినోత్సవ వేడుకల్లో పాల్గొనడం అద్భుతం' అని మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు.

## ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడులు సమర్థనీయం కాదు

(మొదటి పేజీ తరువాయి)

కమిషన్‌లో కశ్మీర్ అంశంపై భారతదేశాన్ని విమర్శించే తీర్మానాన్ని తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఈ తీర్మానాన్ని నిరోధించడంలో ఇరాన్ సహాయపడిందన్నారు. గత కొన్ని దశాబ్దాలుగా భారత్-ఇజ్రాయెల్ మధ్య వ్యూహాత్మక సంబంధాలు బలపడుతున్నాయని సోనియా గాంధీ పేర్కొన్నారు. ఈ ప్రత్యేక పరిస్థితిలో.. శాంతి, సంభాషణల వారధిగా మారడానికి భారతదేశానికి దౌత్య శక్తి, నైతిక బాధ్యత ఉందని ఆమె అన్నారు. ఇది కేవలం ఒక వియుక్త సూత్రం కాదని, పశ్చిమాసియా దేశాలలో నివసిస్తున్న.. పౌరులందరి భద్రతకు సంబంధించిన విషయం అని స్పష్టం చేశారు. వారి భద్రతను తీవ్రంగా పరిగణించి, ప్రభుత్వం విదేశీ దౌత్యంలో తన స్థానాన్ని బలోపేతం చేసుకోవాలని కోరారు. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్ పై హమాస్ జరిపిన దాడిని సోనియా గాంధీ ఖండించారు. హమాస్ పై ఇజ్రాయెల్ జరిపిన ప్రతీకారం.. భయంకరమైనదిగా, అసమానమైనదిగా అభివర్ణించారు. ఈ దాడిలో ఎన్నో ఇళ్ళు, కుటుంబాలు, ఆసుపత్రులు నాశనమయ్యాయని.. 55,000 మందికి పైగా పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఇంత భయంకరమైన దాడిని చూసి కూడా భారత్ మౌనంగా ఉండట కూడదన్నారు. ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంలో భారత్ కల్పించుకోకపోవడాన్ని ఆమె విలువ లొంగుబాటుగా ఉన్నదని విమర్శించారు. ఈ విషయంలో భారత్ వైఖరి స్పష్టంగా ఉండాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించడానికి, అందుబాటులో ఉన్న అన్ని దౌత్య మార్గాలను అనుసరించాలని ఆమె సూచించారు.

## దేశంలో తెలంగాణలోనే స్టార్టప్ విజయవంతం

(మొదటి పేజీ తరువాయి)

విజయగాథ లాగా తెలంగాణను చూడాలి. సబ్బండ వర్ణాల భాగస్వామ్యంతో సాధించిన సమ్మిళిత వృద్ధిలాగా తెలంగాణ విజయాన్ని చెటప్పుకోవచ్చు అని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం తెలంగాణలో ఉంది. 2015 నుంచి 2019 మధ్య కాలంలో కేవలం నాలుగు సంవత్సరాల స్వల్ప కాలంలోనే కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేశాము. అమెరికా అవతల హైదరాబాద్‌లోనే అమెజాన్ అతిపెద్ద క్యాంపస్ ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ క్యాంపస్ టీ-హబ్ హైదరాబాద్‌లో ఉంది. ప్రపంచంలోని మూడో వంతు వ్యాక్సిన్ ఉత్పత్తి తెలంగాణలో జరుగుతుంది. ప్రపంచంలోనే ఐదు అతి పెద్ద టెక్ దిగ్గజ కంపెనీలు హైదరాబాద్‌లోనే తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేశాయి. ఐటీ రంగ ఉద్యోగ కల్పనల్లో వరుసగా రెండు సంవత్సరాల పాటు బెంగళూరుని హైదరాబాద్ దాటింది అని కేటీఆర్ గుర్తు చేశారు. కొత్త రాష్ట్రంగా శిథిలాల నుంచి గెలుపు సౌధాలను తెలంగాణ నిర్మించింది. కొత్త ఆశలు, కొత్త లక్ష్యాలతో మేము తెలంగాణ రాష్ట్రంగా నూతన ప్రయాణాన్ని మొదలుపెట్టాం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఒక పరిశ్రమ ఏర్పాటు చేయాలంటే అనుమతుల కోసం ఎన్ని రోజులు పడుతుందో ఎవరు చెప్పలేని పరిస్థితి ఉండేది. కానీ మేం అధికారంలోకి వచ్చిన తర్వాత 15 రోజుల్లో అనుమతులు వచ్చేలా చేశాం. ఒకవేళ 15 రోజుల్లో లోపు అనుమతులు రాకపోతే ఆ పరిశ్రమను ప్రారంభించుకోవచ్చు. భారతదేశంలోని ఏ రాష్ట్రంలో కూడా ఇలాంటి అవకాశం లేదు అని కేటీఆర్ తెలిపారు. వ్యక్తుల కంటే విధానాలకే మేం ప్రాధాన్యత ఇచ్చాము. భారతదేశంలోని 65 శాతం ప్రజలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వ్యవసాయ రంగంపైనే ఆధారపడి ఉన్నారు. అందుకే మేము వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చాము. 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో నేరుగా దాదాపు రూ. 75 వేల కోట్లు జమచేసిన రాష్ట్రం దేశంలోనే కాదు ప్రపంచంలోనే ఎక్కడా లేదు. మేం తీసుకొచ్చిన ఈ పథకం అద్భుత ఫలితాలను ఇచ్చింది. అందుకే 2014లో ధాన్యం ఉత్పత్తిలో 14వ స్థానంలో ఉన్న తెలంగాణ పంజాబ్, హర్యానా దాటి 2022 నాటికి నంబర్ వన్‌కు చేరింది అని కేటీఆర్ తెలిపారు. బటర్ ఫ్లై ఎఫెక్ట్ గురించి చెప్పుకున్నట్టే కేసీఆర్ ఎఫెక్ట్ గురించి కూడా చెప్పుకోవాలి. ప్రజల జీవితాలను మార్చాలన్న సంకల్పం ఉన్న నాయకుడు అధికారంలో ఉంటే ఏం జరుగుతుంది అనడానికి తెలంగాణ విజయగాథనే నిదర్శనం. కోటి ఇండ్లకు శుద్ధి చేసిన తాగునీటిని అందించిన ఏకైక రాష్ట్రం భారతదేశంలో తెలంగాణ ఒకటి. 80 మీటర్ల సముద్ర మట్టం నుంచి 618 మీటర్లకు నీటిని తీసుకెళ్లే ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ ప్రారంభించారు. ఇన్ లాండ్ ఫిషరీస్‌లో తెలంగాణ నెంబర్ వన్. పారిశ్రామిక అవసరాల కోసం తగినంత నీటిని అందుబాటులో ఉంచిన రాష్ట్రం తెలంగాణ. కేసీఆర్ హయాంలో ఫ్లోరోసిస్ పూర్తిగా నిర్మూలించబడింది. హైదరాబాద్ లాంటి నగరానికి నీటి సమస్యలు లేకుండా శాశ్వత పరిష్కారాన్ని కేసీఆర్ చూపించారు. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థకు ప్రతినిధిగా మీ భాగస్వామ్యం కోసం వచ్చాను. మనం కలిసి అద్భుతాలు చేయవచ్చు. తెలంగాణకు అద్భుతమైన భవిష్యత్తు ఉందని నేను బలంగా నమ్ముతున్నాను. ఈ ప్రపంచానికి ఇండియానే భవిష్యత్తు. తెలంగాణ తన విజయ ప్రస్థానాన్ని కొనసాగిస్తూనే ఉంటుంది అని కేటీఆర్ పేర్కొన్నారు.

**బూర్గంపాడు ఘటన అనుమానుషం**

బూర్గంపాడు మండలంలో గిరిజన మహిళలపై దాడి అమానుషమని కేటీఆర్ పేర్కొన్నారు. బూర్గంపాడు ఘటన సీఎం ఆలోచనలకు అద్దం పడుతోందన్నారు. సీఎంగా అలాంటి వ్యక్తి ఉంటే రాజ్యాంగం ఎక్కడ అమలవుతుంది..? దేశానికి రాహుల్ గాంధీ ఇచ్చే హామీ ఇదేనా..? దేశ మహిళలకు ప్రియాంకా గాంధీ ఇదే గౌరవం కోరుకుంటున్నారా..? మల్లిఖార్జున ఖర్గే మాట్లాడుతున్న సమానత్వం ఇదేనా..? అని కేటీఆర్ ప్రశ్నించారు.

# 22వేల మంది రైతులకు రైతు భరోసా ఎగవేత

- వారికి వెంటనే రైతు భరోసా సాయం అందించాలి
- లేకుంటే 22వేల మందితో ఓఆర్ఆర్ దిగ్బంధిస్తాం
- జిన్నారం రైతు ధర్నాలో హరీష్ రావు హెచ్చరిక



**సంగారెడ్డి,జూన్ 21 (పీసీడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు ఇవ్వకపోతే ఓఆర్ఆర్‌ను దిగ్బంధం చేస్తామని బిఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు హెచ్చరించారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో 22 వేల మంది రైతులకు రైతు భరోసా డబ్బులు ఇవ్వలేదన్నారు. 22 వేల మంది రైతు కుటుంబాలతో ఓఆర్ఆర్ పై వంటావార్పు చేసి బంద్ చేస్తామని ప్రకటించారు. శనివారం సంగారెడ్డి జిల్లాలోని మండల కేంద్రమైన జిన్నారంలో ఏర్పాటు చేసిన రైతుల మహా ధర్నాలో పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రైతు భరోసా డబ్బులు ఇచ్చే వరకు బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ఏర్పాటు చేసి, వారిని ఆర్థికంగా అభివృద్ధి చేశారన్నారు. రైతుల ఆత్మహత్యలు పెరగకుండా భరోసా కలిపించారన్నారు.రైతులు వ్యవసాయ భూముల్లో పంటలు సాగు చేస్తున్నా ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు చెల్లించడం లేదన్నారు. కేసీఆర్ రైతులకు ఎకరానికి రూ.10 వేలు రైతు భరోసా డబ్బులు ఇవ్వడం జరిగిందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే అమలు చేయడం లేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఫించన్ నెలకు రూ.2 వేలు ఇవ్వగా, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ.4వేలు ఇస్తామని హామీ ఇచ్చారని.. ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలలో రైతులకు వ్యవసాయం కోసం 24 గంటలు నాణ్యమైన కరెంట్ సరఫరా చేసిందన్నారు. కరెంట్ కోతలు లేకుండ సరఫరా చేయగా, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కరెంట్ కోతలు ప్రారంభమైన్నాయని ఆరోపించారు. అనుముల రేవంత్‌రెడ్డి కాదు కోతల రేవంత్‌రెడ్డి అని ఆరోపించారు. పటాన్‌చెరు ప్రాంతంలో వ్యవసాయం చేసుకుంటున్న రైతులు పంటలు సాగు చేసేందుకు అప్పులు చేసుకోనే పరిస్థితి వచ్చిందన్నారు. రైతుల కుటుంబాలు అప్పుల పాలు కావడం జరిగిందన్నారు. రైతు భరోసాను ఎన్నిక భరోసాగా కాంగ్రెస్ అమలు చేస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఉండడంతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను అందరికి ఇస్తామని ప్రకటించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం యాసంగిలో రైతులకు రైతు భరోసా డబ్బులు వేయలేదని, మండలంలో ఒక్క గ్రామంలో ఉన్న రైతులకు వేశారన్నారు . ఓట్లు కోసం రైతు బంధు పథకంలో డబ్బులు వేస్తామని ప్రకటన చేశారని ఆరోపించారు. ఒక రైతుకు రాష్ట్ర ప్రభుత్వం రైత భరోసా డబ్బులు రూ. 12 వేలు బాకి ఉందని, ముందుగా రైతులకు బాకీ ఉన్న రూ.12 వేలు వేయాలని డిమాండ్ చేశారు. రైతులను చైతన్యం చేసి రైతు భరోసా కోసం పోరాటం చేస్తామన్నారు. దేవుండ్ల మీద ఒట్టు వేసి హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కటి అమలు చేయలేదన్నారు. ఒక ఎమ్మెల్యే ఆడిగిన నిధులు మంజూరు చేయలేదన్నారు. ముఖ్యమంత్రి కుర్చీలో ఉండి రాష్ట్రం పరువు తీస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ గ్రామ పంచాయతీలకు ట్రాక్టరులు పంపిణి చేస్తే డీజీల్‌కు పైసాలు లేక పనులు చేయడం లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణలో తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులను మూడు నెలలుగా జీతాలు చెల్లించడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం తగ్గిపోయిందన్నారు. ఈ సమావేశంలో సంగారెడ్డి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్, జహీ రాబాద్, దుబ్బాక, నర్సాపూర్ ఎమ్మెల్యేలు కొనింటి మాణిక్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతరెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గ కో ఆర్డినేంటర్ ఆదర్శరెడ్డి, ఎమ్మెల్సీ యాదవ్‌రెడ్డి, పటాన్‌చెరు కార్పోరేటర్ మెట్టు కుమార్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు వెంకటేశం గౌడ్, బాల్‌రెడ్డి, మాణిక్యం, తొంట అంజయ్య, సోమిరెడ్డి, చంద్రాగౌడ్, ఐలాపూర్ మాణిక్ యాదవ్, పాల్గొన్నారు.

## హైడ్రా అంటే కూల్చివేతలు కాదు

- పర్యావరణహిత నగరాభివృద్ధికి కృషి
- రుణాలు ఇచ్చేముందు బ్యాంకర్లు వివరాలు చూడాలి
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టీకరణ



**హైదరాబాద్,జూన్ 21 (పీసీడబ్ల్యూ న్యూస్):** సొంతింటి కలను సాకారం చేయడంలో బ్యాంకర్ల పాత్ర కీలకమైందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. ఇల్లు కొనేందుకు రుణాలిచ్చే ముందు అన్ని విధాలా సరి చూసుకోవాలని బ్యాంకర్లకు సూచించారు. ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ వాల్యుయర్స్, రిజిస్టర్డ్ వాల్యుయర్స్ ఫౌండేషన్, ఎక్షు హైదరాబాద్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ట్రాన్స్‌ఫర్‌మేటివ్ ఎరాలో వాల్యుయేషన్' అంశంపై జరిగిన జాతీయ సదస్సులో రంగనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సుస్థిర వ్యాపారానికి హైడ్రా దోహదం చేస్తోందని అందరూ గ్రహిస్తున్నారని పేర్కొన్నారు. ఎలాంటి మోసాలకు ఆస్కారం లేకుండా సొంతింటి కలను సాకారం చేయడంలో రియల్ ఎస్టేట్ సంస్థలతో పాటు, ఆ ఇంటికి రుణాలు ఇచ్చే అర్థిక సంస్థలు కూడా బాధ్యత వహించాలని రంగనాథ్ సూచించారు. గతేడాది జులై 19న హైడ్రా ఏర్పడిందని.. అంతకుముందు వెలసిన నివాస ప్రాంతాలతో పాటు, అనుమతులు పొంది నిర్మాణ దశలో ఉన్న వాటి జోలికి వెళ్లబోమని స్పష్టం చేశారు. హైడ్రా ఏర్పాటైన తర్వాత నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగిస్తామన్నారు. హైడ్రా అంటే కూల్చివేతలు కాదు.. పర్యావరణ హితమైన నగరాభివృద్ధికి దోహదం చేసే సంస్థగా అందరూ గుర్తిస్తున్నారని వివరించారు. సర్వే నంబర్ ఒకటి చూపించి.. వేరే చోట ఇళ్ల నిర్మాణం చేపడుతున్నవారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆర్థిక సంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వ సంస్థలకు ఆస్తి విలువలను నిర్ణయించడంలో పారదర్శకత, నమ్మకం, కచ్చితత్వాన్ని నిర్ధరించడంలో వాల్యుయేషన్ నిపుణుల పాత్ర చాలా కీలకమైందన్నారు. స్థిరాస్తుల విలువ నిర్ధరించడంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎంత ఉపయోగంగా ఉన్నా.. క్షేత్రస్థాయి పరిశీలన కూడా అంతే ముఖ్యమన్నారు. గొలుసుకట్టు చెరువులను పునరుద్ధరించి.. వరద ముప్పులేని నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలనేది హైడ్రా లక్ష్యమని రంగనాథ్ స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే చెరువులు, నాలాలు, పార్కులు, రహదారుల ఆక్రమణలను నిరోధించి.. ప్రజా అవసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడేందుకు హైడ్రా ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఓఆర్ఆర్ పరిధిలో వెయ్యికి పైగా ఉన్న చెరువుల పునరుద్ధరణ జరిగి.. పార్కులన్నీ పచ్చగా ఉన్నప్పుడు పర్యావరణ సమతుల్యత సాధించగలుగుతామన్నారు.

# క్షేత్రస్థాయిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు పటిష్టంగా అమలు కావాలి

● నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ హాస్పిటల్స్ పై చర్యలు తీసుకోవాలి ● నకిలీ విత్తనాలు, ఎరువులను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలి ● ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎక్కువ సంఖ్యలో డెలివరీలు పెరిగే విధంగా వైద్య అధికారుల దృష్టి సారించాలి ● గ్రామీణ స్థాయిలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలి

● వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య







**హనుమకొండ, జూన్ 21 (పీసీడబ్ల్యూ న్యూస్):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయాలని జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) ఛైర్మన్, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న రైతు భరోసా పథకంతో పాటు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న కృషి సమ్మాన్ నిధి, కృషి సించయ్ యోజన పథకాలు రైతులకు అందే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. జిల్లాలోని వివిధ మండలాల్లో పామాయిల్ సాగుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని, జిల్లాలో ఎక్కువమంది రైతులు సాగు చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ సబ్సిడీ ఎక్కువగా ఉన్న పామాయిల్ సాగులో రైతులను ప్రోత్సహించే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎక్కువ సంఖ్యలో డెలివరీలు పెరిగే విధంగా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలన్నారు. పీఎంఆర్ఎఫ్ ఎంతమంది తీసుకుంటున్నారనే వివరాలను, క్యాన్సర్ స్క్రీనింగ్ ద్వారా గుర్తించిన వారి వివరాలను, వారికందిస్తున్న వైద్య సేవలు, కోలుకున్న వారి వివరాలను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అందజేయాలన్నారు. వచ్చే దిశ మీటింగ్ నాటికి క్షేత్రస్థాయిలో పరిశీలించిన అంశాలు, శాఖలకు సంబంధించిన అన్ని వివరాలు ఉండేలా అధికారులు చూసుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన ప్రసూతి సేవలను అందించాలన్నారు. పల్లె, బస్తీ దావఖానాల ద్వారా నాణ్యమైన వైద్య సేవలను అందించాలన్నారు. బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో మరిన్ని అదనపు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆరోగ్యం అంటే శారీరక, మానసిక పరిస్థితులు బాగుండే విధంగా అవగాహన కల్పించాలన్నారు. గర్భిణీలు ఆరోగ్యవంతంగా ఉండేలా, ఆరోగ్యవంతమైన పిల్లలకు జన్మనిచ్చేలా వైద్య ఆరోగ్యశాఖ, ఐసిడిఎస్ అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండేలా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ విద్యా విధానం ప్రకారం స్టూడెంట్ టీచర్ రేషియో ప్రకారం కూడా లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ స్కూల్స్ ప్రారంభించినట్లయితే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు. వివిధ శాఖల అధికారులతో సమీక్ష అనంతరం దిశ కమిటీ ఛైర్మన్, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా నిధులు వచ్చే అవకాశం ఉన్నందువలన వచ్చే దిశ కమిటీ సమావేశంలో వివిధ శాఖల అధికారులతో పాటు రైల్వే, పర్యాటక, దేవాదాయ, ఆర్కియాలజీ శాఖలు, యూనివర్సిటీ అధికారులు పాల్గొనాలన్నారు. జులై 21న పార్లమెంట్ సమావేశాలు ఉన్నందువలన వివిధ శాఖల అధికారులతో అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ పథకాల ద్వారా ఇప్పటివరకు వచ్చిన నిధులు, ఇంకా రావాల్సిన వాటిపై అధికారులను పూర్తి సమాచారం అడిగి తెలుసుకుంటున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు చేసేందుకు కేంద్ర మంత్రులను కూడా కలిసే అవకాశం ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఆయా శాఖలు తమకు సమాచారం ఇచ్చినట్లయితే వాటిని పరిశీలించిన తదుపరి అమలు చేసేందుకు ఉపయోగపడుతుందన్నారు. వచ్చే దిశ కమిటీ సమావేశం నాటికి సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, వాటి స్థితిగతులపై పూర్తిస్థాయి నివేదికలతో పాల్గొనాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ఏవేవి ఉన్నాయి, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి తులనాత్మక పరిశీలన చేసి వాటి పూర్తిస్థాయి వివరాలతో సమావేశంలో పాల్గొనాలన్నారు. సమావేశం ముందునాటి రోజు వరకు సంబంధిత శాఖల అధికారులు అన్ని వివరాలతో హాజరుకావాలని సూచించారు. ఈ సమావేశంలో వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, ముఖ్య ప్రణాళిక అధికారి సత్యనారాయణ రెడ్డి, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## సబ్ జైల్లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

**పరకాల, జూన్ 21(పిసిడబ్ల్యూ న్యూస్):** అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా సబ్ జైలు పరకాలలో యోగా గురూజీ జీ బోట్ల స్వామి ఆధ్వర్యంలో యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. యోగ గురూ జి స్వామి మాట్లాడుతూ.. గత దశాబ్ద కాలంగా పట్టణ లో విద్యార్థులకు యోగ క్లాసులు, కరాటే మెళకువలు ఉచితంగా నేర్పుతున్నానని తెలియజేశారు. యోగా వల్ల ఉపయోగాలు, ఆసనాలు, ధ్యానం, ప్రాణాయామం, జనరల్ ఎక్సర్సైజులు సూర్య నమస్కారాలు నేర్పించి యోగ యొక్క ప్రాముఖ్యత గురించి సబ్ జైలు లోని ఖైదీల కు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండ్ యన్ ప్రభాకర్ రెడ్డి జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బొంతుపల్లిలో ఉచిత వైద్య శిభిరం...



**వీణవంక,జూన్21(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి, ఆధ్వర్యంలో శనివారం వీణవంక మండలం బొంతుపల్లి గ్రామంలో ఉచిత మెగా వైద్య శిభిరం నిర్వహించారు. ఈ శిభిరంలో 154 మందికి ఆసుపత్రి వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి షుగర్, బీపీ, ECG పరీక్షలు చేపట్టి రోగ నిర్దారణ చేశారు. ఈ సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ బొంతుపల్లి గ్రామ ప్రజలకి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ఈ ఉచిత మెగా వైద్య శిభిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో 24 గంటలు సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఈ ఉచిత వైద్య శిభిరంలో ముధిరాజ్ సంఘ అధ్యక్షుడు పోలు ఐలయ్య, పోలు ఉస్మాన్, కొమురయ్య, కార్తీక్ ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ కోటకర్ణాకర్, శ్రీకాంత్,సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సిద్దు టెంట్ హౌస్ మూడో వార్షికోత్సవ వేడుకలు











**హనుమకొండ, జూన్ 21(పిసిడబ్ల్యూ న్యూస్):** కాజీపేట లోని సిద్దు టెంట్ హౌస్ మూడో వార్షికోత్సవ వేడుకలు శనివారం బిఆర్ఎస్ అర్బన్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి గబ్బెట శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, మాజీ కార్పొరేటర్ దాస్యం విజయభాస్కర్ పాల్గొని, కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గబ్బెట శ్రీనివాస్ రాజకీయ, సామాజిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ.. కుటుంబ పోషణ నిమిత్తం టెంట్ హౌస్ ఏర్పాటు చేసుకొని యువతరానికి స్ఫూర్తిగా నిలిచారన్నారు. 50 వసంతాలు పూర్తిచేసుకుని 51వ వసంతంలోకి అడిగిడుతున్న గబ్బెట శ్రీనివాస్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో గబ్బెట శ్రీనివాసును ముఖ్య అతిథులు, పార్టీ నేతలు శ్రేయోభిలాషులు, అభిమానులు, స్నేహితులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి నార్ల గిరి రమేష్, నాయకులు సిరుమల్ల దశరథం, సుంచు కృష్ణ, పాలడుగుల శివకుమార్, కాటపురం రాజు, గబ్బెట కరుణ్, ఎండి అఫ్జల్, సుంచు అశోక్, పాలడుగుల రామస్వామి, గబ్బెట ఎల్లేష్, మాచర్ల ప్రభాకర్, బస్వా యాదగిరి, కొత్తం మల్లేష్, గబ్బెట ఉపేందర్ మతిన్, పప్పుల గోవర్ధన్, ఎనగందుల సురేష్, కొండేటి సన్నీ, విజయ, లక్ష్మీబాయి, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న కొన్ని బ్యాంకులపైన చర్యలు తీసుకోవాలి!

● ఎం.హెచ్ పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మైస ఉపేందర్ మాదిగ



**హనుమకొండ, జూన్ 21(పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతులకు పంటలు వేసుకోవడానికి ఒక భరోసాగా మారుతుంటే.., బ్యాంకు వాళ్లు మాత్రం వాళ్ల పని వాళ్ళు చేసుకుంటూ వెళుతున్నారని, అది ఎంత మాత్రం సమంజసం కాదని, కావున ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి రైతులకు అండగా నిలవాలని ఎం. హెచ్ పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మైస ఉపేందర్ మాదిగ ఒక ప్రకటనలో అన్నారు. ప్రభుత్వం ఒక పక్క రైతులకు అండగా ఉండాలని రైతుబంధు వేస్తుంటే మరో పక్క బ్యాంకు వాళ్లు మహిళా సంఘంలో లోన్ ఉందిని, పర్సనల్ లోన్ ఉందని పాత బాకాయిలు ఉన్నాయని రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, పెట్టుబడి లేక రైతులు ఇబ్బంది పడుతుంటే ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని రైతులు ఆనందంగా ఉంటే, బ్యాంకులు మాత్రం రైతు బంధును ఊడ్చే పనిలో నిమగ్నమైనారని ఎద్దేవా చేశారు. అలాంటి బ్యాంక్ ల పైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని మైస ఉపేందర్ మాదిగ పేర్కొన్నారు.

## యోగ ఉన్నతమైన జ్ఞానాన్ని ఏకగ్రతను పెంపోందిస్తుంది



**గంగాధర, జూన్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని లక్ష్మీదేవి పల్లె గ్రామంలోయోగ జ్ఞానానికి, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు, ఒత్తిడిని తగ్గించేందుకు, ఏకాగ్రతను పెంచేందుకు యోగ ఎంత అవసరమని యోగ అధ్యాపకుడు విష్ణు అన్నారు. అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లి నరేంద్ర విద్యాలయం లో జిల్లా విద్యా శాఖ ఆదేశాల ప్రకారం శనివారం యోగ ప్రాముఖ్యత వివరించారు. నిర్వహించిన యోగా సందర్భంగా విద్యార్థులతో యోగాసనాలు వేయించి వాటి గురించి వివరించారు. యోగా ద్వారా ఏకాగ్రత, జ్ఞానం , ఆధ్యాత్మికత మెరుగుపడుతుందని అన్నారు.యోగా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందనీ, ఒత్తిడిని తగ్గించి, వ్యాయామాలు మనస్సును ప్రశాంతంగా ఉంచడానికి, ధ్యానం ద్వారా ఒకరు తమ గురించి తాము తెలుసుకోవచ్చునని అన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జ్ఞానానికి యోగ ఎంతో అవసరం

**గంగాధర, జూన్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం మధురానగర్‌లో జ్ఞానానికి, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరిచేం దుకు, ఒత్తిడిని తగ్గించేందుకు, ఏకాగ్రతను పెంచేందుకు యోగ ఎంత అవసరమని శ్రీ దత్త సాయి జ్ఞాన మండలి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన యోగా దినోత్సవంలో యోగ గురూజీ కముటం నర్సయ్య అన్నారు. గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలోని సురభి కాన్వెంట్ హై స్కూల్లో యోగా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా గురుజి విద్యార్థులతో యోగాసనాలు వేయించి వాటి గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా ద్వారా ఏకాగ్రత, జ్ఞానం మరియు ఆధ్యాత్మికత మెరుగుపడుతుందని అన్నారు. యోగా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందనీ, ఒత్తిడిని తగ్గించి, వ్యాయామాలు మనస్సును ప్రశాంతంగా ఉంచడానికి, ధ్యానం ద్వారా ఒకరు తమ గురించి తాము తెలుసుకోవచ్చునని మరియు ఉన్నతమైన జ్ఞానం వైపు అడుగులు వేయవచ్చునని సూచించారు. క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం వల్ల ఏకాగ్రత పెరుగుతుందని అన్నారు.








## పుట్టెడు దుఃఖంతో ఉన్న కుటుంబాన్నీ ఓదార్చిన చల్మెడ..

### - రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి చాలా బాధాకరం...

**వేములవాడ,జూన్21(పీసీడబ్ల్యూ న్యూస్):** వేములవాడ పట్టణం సుబ్రమణ్యంనగర్ కు చెందిన మల్యాల పండరినాథ్(25) బుధవారం రాత్రి ఆరేపల్లి రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా పుట్టెడు దుఃఖంతో ఉన్న పండరీనాథ్ కుటుంబ సభ్యులను శుక్రవారం బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు. రోడ్డు ప్రమాదంలో యువకుడు పండరినాథ్ మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. వారి వెంట సీనియర్ నాయకులు రామతీర్థపు రాజు, మాజీ కౌన్సిలర్ సిరిగిరి చందు, నాయకులు మంతె సందీప్, కనికరపు రాజయ్య, పిట్టల మధు, దేవరాజు, భరత్, సుమన్, ఉపేందర్ తదితరులు ఉన్నారు.

## మండల విద్యాధికారులపై ఆగ్రహించిన కలెక్టర్ ప్రావీణ్య



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో నూతన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆకస్మికంగా పర్యటించారు, స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందవలసిన యూనిఫాం లు ఇంకా ఎందుకు ఇవ్వలేదని మండల విద్యాధికారి శంకర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు , శనివారం సాయంత్రం లోగ పిల్లలందరికీ ఏకరూప దుస్తులు అందించి తమకు రిపోర్ట్ సమర్పించాలని ఆదేశించారు, ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి సరస్వతి ,మున్సిపల్ కమిషనర్ ఉమ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## కమాన్ పూర్ బద్దిపల్లి మట్టి రోడ్డు ఫార్మేషన్‌కు శంకుస్థాపన చేసిన సుడా చైర్మన్...



**కరీంనగర్ రూరల్,జూన్21(పీసీడబ్ల్యూ న్యూస్):** కొత్తపల్లి మండలం కమాన్ పూర్ గ్రామం నుండి బద్దిపల్లి ఇందిరమ్మ కాలనీ వరకు మట్టి రోడ్డు ఫార్మేషన్ పనులకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ వేములవాడ హైవే రోడ్డు నుండి బద్దిపల్లి ఇందిరమ్మ ఇండ్ల వరకు తక్కువ దూరంతో వెలిచాల్ మీదుగా జగిత్యాల్ రోడ్డు వరకు చేరుకోవడానికి చాలా సౌకర్యవంతంగా ఉంటుందని స్థానిక ప్రజల కోరిక మేరకు 20 లక్షల నిధులు కేటాయించి పనులు ఈ రోజు ప్రారంభించామని నరేందర్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో మడుపు మోహన్,శ్రవణ్ నాయక్,స్వామి గౌడ్,మురళి మనోహర్, సిరిపురం నాగప్రసాద్, పంజాల శ్రీనివాస్, రుద్ర మనోహర్,డిఈ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ఉస్మానియా యూనివర్సిటీలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

● ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ రామచంద్రనాయక్





**హైదరాబాద్, జూన్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఉదయం ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ వేడుకకు డిప్యూటీ స్పీకర్ మరియు డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "యోగ భారతీయ సంస్కృతి సారధిగా నిలిచిన అమూల్య ధనము. ఇది కేవలం శరీర వ్యాయామం మాత్రమే కాదుబీ మన శరీరం, మనస్సు, ఆత్మల మధ్య సమన్వయం సాధించే మార్గం. మన యువత యోగాన్ని ప్రతిరోజూ జీవనశైలిలో భాగంగా ఆరోగ్యవంతమైన, శాంతిమయమైన, సమాజపట్ల బాధ్యతగల జీవితం గడపాలని కోరుకుంటున్నాను" అన్నారు.అలాగే, "ప్రతి విద్యాసంస్థలో యోగా తరగతులను తప్పనిసరిగా ప్రవేశపెట్టాలి. యోగా ఒక ప్రాచీన సంపద అయినప్పటికీ ఆధునిక జీవనశైలికి అనువుగా, ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య సాధనగా నిలుస్తోంది. యోగాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంలో భారత్ పోషించిన పాత్ర విశేషమైనది," అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఓయూ యూనివర్సిటీ ఉపాధ్యక్షులు, అధ్యాపక వర్గం, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. శతాధిక యువత ఉత్సాహంగా యోగా ఆసనాల్లో తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి...

● మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ




తిమ్మాపూర్,జూన్21(పిసిడబ్ల్యూ న్యూస్):ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామంలో నౌసియా సుల్తానా-గౌస్ పాషా దంపతులు చేపట్టిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ నుస్తులాపూర్ గ్రామానికి 29 ఇళ్లు మంజూరు చేశామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలు చేపట్టాలని, అంతేకాకుండా నిర్దేశిత గడువులోగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి బిల్లుల చెల్లింపులో ఎలాంటి జాప్యం ఉండదని, ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ సందర్భంగా సిరిగినేని కొండల్ రావు తమ గ్రామానికి అదనంగా మరో 25 ఇళ్లు మంజూరు చేయాలని కోరగా, ఎమ్మెల్యే పరిశీలిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ సురేందర్ రెడ్డి, తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, పార్టీ నాయకులు సుధగోని లక్ష్మీనారాయణగౌడ్, మోరపల్లి రమణారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాస్ రావు, కుంట రాజేందర్ రెడ్డి, కొత్త తిరుపతిరెడ్డి, బుధారపు శ్రీనివాస్, ఎస్.కొండల్ రావు, శ్రీగిరి రంగారావు, కొత్త రాజిరెడ్డి, చిరంజీవి, చింతల లక్ష్మారెడ్డి, గుజ్జ రవీందర్ రెడ్డి,తాజుద్దీన్, గంకిడి లక్ష్మారెడ్డి, గొట్టెముక్కుల సంపత్ రెడ్డి, పోలు రాము, రమేశ్ తదితరులు పాల్గొన్నారు. **బాలయ్యపల్లిలోనే పంచాయతీ భవన నిర్మాణం:**తిమ్మాపూర్ మండలంలోని బాలయ్యపల్లి, సాయబ్ పల్లి లతో నూతనంగా ఏర్పాటయిన గ్రామపంచాయతీలో పంచాయతీ భవన నిర్మాణం ఎక్కడ చేపట్టాలనే విషయంలో ఇరు పల్లెల్లో కొనసాగుతున్న వివాదానికి ఎట్టకేలకు తెరపడింది.మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం బాలయ్యపల్లిలో ఇరు పల్లెలకు చెందిన పెద్దలతో మాట్లాడి బాలయ్యపల్లిలోనే భవన నిర్మాణం చేపట్టాలని నిర్దేశించారు. ప్రధాన రహదారికి చేరువలో బాలయ్యపల్లి ఉండటం వల్ల గ్రామపంచాయతీ నూతన భవనాన్ని అక్కడే నిర్మిస్తే ప్రజలకు అందుబాటులో ఉండటమే కాకుండా సౌకర్యవంతంగా కూడా ఉంటుందని ఆయన చెప్పారు. ఈ మేరకు ఆయన మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రెడ్డిని ఆదేశించారు. దీంతో గ్రామపంచాయతీ భవనం ఎక్కడ నిర్మించాలనే వివాదానికి తెరపడినట్టయింది.

## ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి అర్పించిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు



**నర్సంపేట, జూన్ 21(పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ సార్ తెలంగాణ రాష్ట్రం కోసం అనునిత్యం పరితపించి మన ప్రాంతానికి జరుగుతున్న అన్యా యాన్ని వెలుగెత్తి చాటి, ఆరు దశాబ్దాల తెలంగాణ ఉద్యమానికి చుక్కాణిగా ఉంటూ తెలంగాణ వాదాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మేధావి మలిదశ ఉద్యమానికి , తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నేత కేసిఆర్ తో కలిసి ఉద్యమాన్ని తెలంగాణ రాష్ట్ర నలుమూలల గ్రామ గ్రామాన ఉద్యమ ఆకాంక్షను తెలిపేలా చేశారు.ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా బిఆర్ఎస్ పట్టణ పార్టీ ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ పార్టీ అధ్యక్షులు నాగెల్లి వెంకటనారాయణ గౌడ్, ప్రధాన కార్యదర్శి వేణుముద్దల శ్రీధర్ రెడ్డి, బిఆర్టి యు జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, ప్రచార కార్యదర్శి మండల శ్రీనివాస్ , ఉపాధ్యక్షులు రాయకుల సారంగం, పెండ్యాల యాదగిరి, అప్పాల సుదర్శన్,మాజీ కౌన్సిలర్లు నాగిశెట్టి ప్రసాద్, దేఓజు సదానందం, వాసం సాంబయ్య, మహబూబ్ బాషా, గందె చంద్రమౌళి, పెండెం వెంకటేశ్వర్లు, సుధాకర్ రెడ్డి, వార్డు అధ్యక్షులు నాగిరెడ్డి రవి, సాలన్న, పార్టీ నాయకులు మంద ప్రసాద్, దొమ్మటి సంతోష్, బగ్గీ రాజు దేవోజు హేమంత్, నల్ల రవీందర్, కాలే రాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## చైతన్యపురిలో రూ.1.06 కోట్లతో సీసీ రోడ్డు పనులకు కేంద్ర మంత్రి శ్రీకారం...




**కరీంనగర్,జూన్21(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ లోని చైతన్యపురి డివిజన్ లో రూ.1 కోటి 06 లక్షల రూపాయల మున్సిపల్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ఈరోజు ఉదయం 57వ డివిజన్ లోని విజేత సూపర్ మార్కెట్ వద్ద 45 లక్షల 20 వేల రూపాయల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. వీటితోపాటు చైతన్యపురిలోని బేతల్ చర్చి సమీపంలో రూ.28 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ, సీసీ రోడ్ల పనులను, విజేత సూపర్ మార్కెట్ సమీపంలో 33 లక్షల 60 వేల రూపాయల వ్యయంతో చేపట్టిన ఆర్సీసీ శ్లాబ్ కల్వర్ట్, సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆయా పనులన్నీ కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ జనరల్ ఫండ్స్ నిధులతోనే చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, మాజీ మేయర్ సునీల్ రావు, స్థానిక మాజీ కార్పొరేటర్ బండ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం




**గంగాధర, జూన్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం బూరుగుపల్లి గ్రామంలో ఈ రోజు ఎల్లమ్మ టెంపుల్ ప్రాంగణంలో యోగా వేడుకలు నిర్వహించారు యోగా ట్రైనర్ గా రాష్ట్రయ స్వయం సేవక్ సంఘ్ విష్ణు గారు యోగా ద్వారా నేర్పించడం జరిగింది.ముఖ్య అతిథిగా సాగి సుధాకర రావు రిటైర్డ్ సిఐ గారు మాట్లాడుతూ రోజు యోగా చేయడం వలన మానవ శరీరానికి మరియు మానసిక ఉల్లాసానికి ఎంతగానో తోడ్పడుతుందని గౌరవ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడి జూన్ 21 ను అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ఏర్పాటు చేసిన తర్వాత ప్రపంచ దేశాలన్నీ యోగా ను నేర్చుకుంటున్నాయని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు దూలం కళ్యాణ్, బిజెపి అధ్యక్షుడు పంజాల ప్రశాంత్,బీజేపీ చొప్పదండి కన్వీనర్ పెరుక శ్రవణ్ కుమార్, బూరుగుపల్లి మాజీ సర్పంచ్ గడ్డం అంజయ్య,విన్నమనేని సత్యనారాయణ రావు,దళిత మోర్చా అధికార ప్రతినిధి మల్యాల వినయ్ సాగర్, వినుకొండ నరసింహారెడ్డి,మండల ప్రధాన కార్యదర్శి రేండ్ల శ్రీనివాస్,మండల ఉపాధ్యక్షులు బొమ్మకంటి రాజిరెడ్డి,బిజెపి నాయకులు ఆకుల మనోహర్,గడ్డం జానీ,మురళి,డాక్టర్ రాజేశం,దూలం తిరుపతి,సాగి రఘు,బొమ్మ కంటి తిరుపతి, విజయ్ మెదురీ,శ్రీనివాస్, ప్రశాంత్,మల్లికార్జున చిందం ఆంజనేయులు, బిజెపి నాయకులు వివిధ గ్రామాల ప్రజలు వివిధ ల సంఘాల నాయకులు విశ్రాంత ఉద్యోగులు, డాక్టర్లు క్రీడాకారులు పాల్గొనడం జరిగింది.

## ప్రోవి లాజిక్ హార్డ్ వేర్ సంస్థను ప్రారంభించిన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

**మల్కాజిగిరి,జూన్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** నేటి పోటీ ప్రపంచంలో విద్యతో పాటు, సాంకేతిక నైపుణ్యం అవసరం. అందులో భాగంగా విద్యార్థులకు నైపుణ్యం అందించేందుకు అతి చిన్న వయసులోనే యువ ఎంటర్ప్రెన్ ప్రశాంతి చందా ప్రోవి లాజిక్ స్థాపించింది. మాదాపూర్ లో ఈ సంస్థ కార్యకలాపాలు మొదలయ్యాయి. ఈ సంస్థ కార్యాలయాన్ని శనివారం మల్కాజిగిరి బిజెపి ఎంపీ ఈటెల రాజేందర్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ యువకుల నైపుణ్యం కోసం ఇలాంటి సంస్థలు స్థాపించడం చాలా ముఖ్యమని ఆయన కొనియాడారు. నిరుద్యోగ యువతకు గొప్ప అవకాశం దానిని సద్వినియోగం చేసుకొనీ ఆర్థిక అభివృద్ధి చెందాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంస్థ కు సంబంధించిన ప్రతినిధులు, స్టూడెంట్ లో హాజరయ్యారు.ప్రోవి లాజిక్ అనేది ఒక ప్రధాన VLSI శిక్షణ, కెరీర్ అభివృద్ధి సంస్థ, ఇది ఔత్సాహిక ఇంజనీర్లను అగ్రశ్రేణి సెమీకండక్టర్ నిపుణులుగా చేయడం, విద్యను అందించడం, ఉన్నత స్థాయి సెమీకండక్టర్ నిపుణులుగా ఎదగడం కోసం నిర్మించబడింది. విద్యార్థుల సాంకేతిక నైపుణ్యం పెంచడం, అధిక-నాణ్యత, పరిశ్రమ-సంబంధిత విద్యను అందించడానికి ప్రోవి లాజిక్ స్థాపించబడిందిఇంజనీరింగ్ ఎలక్ట్రానిక్ పూర్తి చేసినవారు ప్రోవి లాజిక్ లో ట్రైనింగ్ తీసుకోవచ్చు. ఇందులో ట్రైనింగ్ తీసుకున్న వారికి వివిధ సంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తారు. మేకింగ్ ఇండియాలో భాగంగా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలో ఇలాంటి ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ల కోసం కేంద్ర ప్రభుత్వం సపోర్ట్ చేస్తా ఉంది. కేంద్ర ప్రభుత్వం కూడా సెమీ కండక్టర్స్ ను ప్రోత్సహిస్తోంది.. ఇందులో భాగంగా త్వరలో గుజరాత్ ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ లాంటి రాష్ట్రాలలో మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ల ప్రోత్సాహానికి కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొని బిజెపి మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ కు కృతజ్ఞతలు తెలిపారు.



# రైతు భరోసా నిధుల విడుదలకు డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ధర్నా





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** పటాన్‌చెరు నియోజకవర్గంలోని జిన్నారం మండల కేంద్రం అంబేద్కర్ చౌరస్తాలో నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి గారు నేతృత్వం మరియు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో "రైతు భరోసా" నిధులు వెంటనే విడుదల చేయాలంటూ పటాన్ చెరువు నియోజకవర్గంలోని బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహా ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన ధర్నాకు ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి శ్రీ తన్నీరు హరీష్ రావు, జిల్లా ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, కొత్త ప్రభాకర్ రెడ్డి, సునీత లక్ష్మి రెడ్డి, మాణిక్ రావు, డి.సి.ఏం.ఎస్ చైర్మన్ మల్కాపురం శివ కుమార్, మఠం బిక్షపతి, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజకవర్గంలోని రామచంద్రపురం, జిన్నారం, పటాన్‌చెరు, అమీన్పూర్ మండలాల్లో కలిపి సుమారు 42,302 ఎకరాల భూమికి రైతులు ఆధారపడుతున్నారు. అయితే ఇప్పటివరకు 27,120 మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ కాకపోవడం వల్ల వేలాది మంది రైతులు ఆర్థికంగా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం కరోనా వంటి సంక్షోభ సమయంలో కూడా రైతులకు నిధులు నిలిపివేయకుండా అందించిందని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను విస్మరించిందని విమర్శించారు. ఆరు గ్యారంటీలు అమలు కాకుండా ఉండటం, రైతులపై తీవ్ర అన్యాయం జరగడం, ఇది "కోతల ప్రభుత్వం" అనే వాస్తవాన్ని నలుదిశలా చాటుతోందని వారు అన్నారు. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ప్రభుత్వాన్ని గట్టిగా హెచ్చరిస్తూ వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశాయి. రైతులకు తక్షణమే న్యాయం జరగాలని వారు కోరారు. అనంతరం ఏం.ఆర్.ఓ కి వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జిన్నారం వెంకటేష్ గౌడ్, పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, జిన్నారం మాజీ జడ్పీటీసీ కొలను బాల్ రెడ్డి, రామచంద్రపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, గుమ్మడిదల మండలం సీనియర్ బీఆర్ఎస్ నాయకులు గోవర్ధన్ రెడ్డి, తెల్లాపూర్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్,, జిన్నారం మండలం అధ్యక్షుడు రాజేష్, గుమ్మడిదల మండలం అధ్యక్షడు ప్రభాకర్ రెడ్డి, సర్కిల్ అధ్యక్షుడు పరమేష్ యాదవ్, తెల్లాపూర్ మున్సిపాలిటీ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్, నియోజవర్గ బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సన్‌షైన్ స్కూల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహణ




**పెద్దపల్లి, జూన్21(పిసిడబ్ల్యూ న్యూస్):** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని, పెగడపల్లి లోని సన్‌షైన్ లెర్నింగ్ స్కూల్ ప్రాంగణంలో యోగా దినోత్సవ వేడుకలు ఎంతో ఉత్సాహభరితంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా యోగా నిపుణులు విద్యార్థులకు యాసనాలు, ప్రాణాయామం, ధ్యానం (మెడిటేషన్) వంటి యోగా అభ్యాసాలను ప్రాక్టికల్‌గా చూపిస్తూ, వాటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. యోగా ద్వారా శారీరక శక్తి, సమతౌల్యం, ఒత్తిడి తగ్గుదల, చదువులో ఏకాగ్రత పెరుగుదల వంటి అనేక ప్రయోజనాలు పొందవచ్చని వారు వివరించారు. సన్‌షైన్ పాఠశాల కరస్పాండెంట్ సయ్యద్ నసీర్ మాట్లాడుతు "యోగా అభ్యాసం విద్యార్థుల శారీరక, మానసిక సామర్థ్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది" అని తెలిపారు. ధ్యానంపై ప్రత్యేక సెషన్ ద్వారా భావోద్వేగాల నియంత్రణ, మానసిక ప్రశాంతత పెంపు వంటి అంశాల్లో విద్యార్థులకు ఉపయుక్తమైన మార్గదర్శనం అందించబడిందన్నారు. విద్యార్థి ప్రతినిధులు మాట్లాడుతూ, ఈ కార్యక్రమం తమలో తెలివితేటలు, నిబద్ధతను పెంపొందించిందని పేర్కొన్నారు. "యోగా ఆరోగ్య పరిరక్షణ మాత్రమే కాకుండా, మానసిక శాంతి మరియు ఆత్మవిశ్వాసం పెంపుకు దోహదపడుతుంది" అని నిపుణులు అభిప్రాయపడ్డారు. సన్‌షైన్ లెర్నింగ్ స్కూల్ విద్యార్థుల భౌతిక, మానసిక అభివృద్ధిపై చూపుతున్న శ్రద్ధను ప్రతిబింబించేలా ఈ యోగా దినోత్సవం ఒక స్ఫూర్తిదాయక కార్యక్రమంగా మారిందని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి మానవాభివృద్ధికి దోహద పడే కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పి ఈ టి నరేష్, నిహారిక, మమత, లత , శ్రీలక్షిత, జెస్సీ ,మోహన్, మల్లేశం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# రాయల్ జూనియర్ కళాశాలలో యోగా సందేశం, విద్యార్థులకు జీవన మార్గదర్శనం

● ఆరోగ్యమే మహాభాగ్యం - యోగం ద్వారా విద్యార్థులలో చైతన్యం!





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని, సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని రాయల్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు యోగా ప్రాముఖ్యతను వివరించడమేకాక, వివిధ ఆసనాలు, ప్రాణాయామాలు, ధ్యానాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి కళాశాల కామర్స్ సీనియర్ ఉపన్యాసకులు శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపల్ శ్రీ కృపానిది పరిధ మాట్లాడుతూయోగ అనేది శారీరక ఆరోగ్యానికి తోడు మానసిక స్థిరతను కూడా ఇస్తుంది. ప్రతి విద్యార్థి దీన్ని ప్రతిరోజూ ఆచరిస్తే జీవితాన్ని విజయవంతంగా తీర్చిదిద్దుకోవచ్చు అని విద్యార్థుల దైనందిన ఒత్తిడి, పరీక్షల భారం, డిజిటల్ డివైజ్‌ల ప్రభావం వల్ల వారిలో మానసిక అలసట పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో యోగా ఒక శక్తివంతమైన ఆయుధం. ఇది శరీరాన్ని కాకుండా మనస్సునూ శుద్ధిపరుస్తుంది. ప్రతి విద్యార్థి రోజూ కనీసం పది నిమిషాలు యోగానికి సమయం కేటాయిస్తే, ఆరోగ్యంగా, దృఢమైన వ్యక్తిత్వంతో ఎదగగలుగుతారు. యోగా ద్వారా మనశ్శాంతి, ఏకాగ్రత, ఆత్మనిబ్బరం పెరుగుతాయి. ఇవన్నీ విద్యలో విజయం సాధించడానికి అవసరమైన ముఖ్యమైన అంశాలు అని తెలుపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపన్యాసకులు సుభాష్, భీమేష్, భాస్కర్, నాగేశ్వరరావు, సరోజినీ, అమూల్య, నందిని, శ్రావణి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులెందరికీ ఈ యోగా శిక్షణ ఓ కొత్త ఉత్తేజాన్ని ఇచ్చిందని నిర్వాహకులు తెలిపారు.

# పరేక్ ప్లాస్ట్ పరిశ్రమ కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం

● కార్మిక శాఖ అధికారుల సమక్షంలో కుదిరిన వేతన ఒప్పందం ● పరిశ్రమ యూనియన్ గౌరవ అధ్యక్షులు, పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** పటాన్చెరు పరిధిలోని పరేక్ ప్లాస్ట్ పరిశ్రమ కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం చేయడం జరిగిందని పరేక్ ప్లాస్ట్ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు, స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సంగారెడ్డి లోని కార్మిక శాఖ కార్యాలయంలో డీసీఎల్ రవీందర్ రెడ్డి సమక్షంలో పరిశ్రమ యాజమాన్యం తరపున సమీర్ కులకర్ణి, కార్మిక సంఘం తరపున యూనియన్ అధ్యక్షులు, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ ల మధ్య వేతన ఒప్పందంపై చర్చలు జరిగాయని తెలిపారు. మెరుగైన వేతన ఒప్పందం అందిస్తూ నిర్ణయం తీసుకోవడం జరిగిందని తెలిపారు. వేతన ఒప్పందంలో ప్రధానంగా రాబోయే మూడు సంవత్సరాలకు గాను ప్రస్తుతం అందుకుంటున్నా వేతనానికి అదనంగా ప్రతి కార్మికుడు రాబోయే మూడు సంవత్సరాల పాటు ప్రతి సంవత్సరం 4000 రూపాయల చొప్పున మొత్తం 12,000 వేల వేతనం సవరణ జరిగిందని తెలిపారు. ప్రతి దసరా పండగకి 2500 రూపాయల యాన్యువల్ డే గిఫ్ట్ తో పాటు, బోనస్, ఇతర సౌకర్యాలు లభిస్తాయని తెలిపారు. తమ సంఘంపై కార్మికుల పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా మెరుగైన వేతన ఒప్పందం చేయడం జరిగిందని ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లోనూ కార్మికుల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. మెరుగైన వేతన ఒప్పందం చేసిన ఎమ్మెల్యే జిఎంఆర్ ను పరిశ్రమ కార్మికులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం ప్రతినిధులు సతీష్, బాల రాజు, రాజు, మంగ రావు, వినోద్, సత్యనారాయణ, శ్రీకాంత్, బాల్ రెడ్డి, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# యోగా ప్రాముఖ్యతను తెలిపిన యోగా టీచర్లు: సంగీత, బాలయ్యల సహకారం

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం , ఎన్కె పల్లి గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవానీ పాఠశాల ఉపాధ్యాయులు బాలయ్య , సంగీత ల ఆధ్వర్యంలో ఘనంగా జరు పుకోవడం జరిగింది, యోగాసానల యొక్క ప్రయోజనాలను విద్యార్థులు తెలుసుకుని వారి రోజు వారి దిన చర్యలో భాగంగ ఆచరించే విధంగా అలవాటు చేస్తామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలయ్య, ఉపాధ్యాయిని సంగీత తెలిపారు, కేవలం విద్యార్థులు మాత్రమే కాకుండా వారి తల్లి తండ్రులకు సైతం పిల్లలు ఇంటి వద్ద అలవాటు చేసుకునేలాగ చేస్తే ప్రస్తుత పరిస్థితుల్లో ఎదుర్కొంటున్న కొన్ని అనారోగ్య సమస్యలు దూరం చేసుకోవచ్చని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు







# ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ నిర్వహణ

**గంగాధర, జూన్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంప్రభుత్వ జూనియర్ కళాశాల గంగాధర లో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 21 వ తారీఖున జరుపుకుంటారు. 2014 సెప్టెంబర్ 27 తారీఖున భారత ప్రధాని నరేంద్ర మోడీ గారు ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో అంతర్జాతీయ యోగా దినోత్సవంను జూన్ 21 వ తారీఖున జరపాలని ప్రతిపాదించగా సుమారు 175 దేశాలు దీనిని ఆమోదించాయి. జూన్ 21 2015 నుండి ప్రపంచ దేశాలు అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నాయి. యోగా అనేది భారతదేశం యొక్క ప్రాచీన జీవన విధానం అని దీని ద్వారా మనసును, శరీరాన్ని ఏకం చేసుకుని ఆనందకరమైన జీవితాన్ని గడపవచ్చని, యోగా ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని, ఒత్తిడిని అధిగమించవచ్చని , ప్రతి వ్యక్తి యోగాను విధిగా అభ్యసించవలసిందిగా గౌరవ ప్రిన్సిపాల్ సత్యనారంజనేయ గారు కార్యక్రమం ను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఓ ఎల్. సురేష్, ఏజీఎంసి పి. గోపాల్, అధ్యాపక బృందం జె. ఇందూర, పి. ఇందిరా, రాజమహేందర్ రెడ్డి, రాజు, మహేశ్వర్, ఎ .రాజు, ఆఫీస్ సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# సదాశివపేటలోని వివిధ గ్రామాల్లో యోగా కార్యక్రమాలు



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** **ఎన్కేపెల్లి గ్రామంలో యోగాసనాలు.** సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం , ఎన్కె పల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో పిల్లలతో పాటు వారి తల్లులకు ,ముఖ్యంగా గర్భిణీ స్త్రీలకు యోగాసనాల ద్వారా జరిగే ఆరోగ్య ప్రయోజనాలు అంగన్వాడీ కార్యనిర్వాహకురాలు స్వరూప, ANM స్వరూప, ఆశ వర్కర్ మాధవీ, గ్రామంలోని మహిళలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని వారి దైనందిన చర్యగా ఆచరిస్తామని, అలా అలవాటు చేసుకోవాలని సూచించారు**హాట్కర్ పేట గ్రామంలో యోగాసనాలు.** సదాశివపేట హాట్కర్ పేట లో గల అంగన్వాడీ కేంద్రంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఆ శాఖ కార్యనిర్వాహకురాలు స్వరూప రాణి, పిల్లలకు యోగా ఆసనాలు వేయించడం జరిగింది, ఈ యోగా అనేది పిల్లల దినసరి చర్యలో భాగంగ ప్రతి రోజు చేయిస్తూ వారికి అలవాటుగా చేస్తామని AWC స్వరూపరాణి అన్నారు.



# రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి పాటుపడతాం...

**• కేంద్ర మంత్రి బండి, ఎమ్మెల్యే కవ్వంపల్లి పునరుద్ఘాటన.**

**తిమ్మాపూర్,జూన్21(పీసీడబ్ల్యూ న్యూస్):** రాజకీయాలకు అతీతంగా మానకొండూర్ నియోజవర్గ అభివృద్ధికి పాటుపడతానని కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పునరుద్ఘాటించారు. శనివారం తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలోని 75 లక్షల రూపాయలతో చేపట్టిన సీసీ రోడ్డును వారిద్దరు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల వరకే రాజకీయాలను పరిమితం చేయాలని, అభివృద్ధికి రాజకీయాలు అడ్డం కాకూడదన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని మానకొండూర్ నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని చెప్పారు. ఎలాంటి భేషజాలకు పోకుండా అభివృద్ధికి పాటుపడతానని ఆయన చెప్పారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లితో కలిసి అభివృద్ధికి పాటుపడతానని ఆయన చెప్పారు.ఇప్పటికే కొన్ని అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. గన్నేరువరం - కరీంనగర్ మధ్య దూరభారాన్ని తగ్గించేందుకు మానేరుపై బ్రిడ్జి నిర్మించే విషయమై కేంద్ర రోడ్డు రవాణా రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి కోరినట్టు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి ఢిల్లీ వచ్చినప్పుడు కూడా సదరు మంత్రిని కలిశామని ఆయన గుర్తు చేశారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ పార్టీలు వేరైనప్పటికీ అభివృద్ధి



విషయంలో ఇద్దరం అన్నదమ్ముల మాదిరిగా కలిసి పని చేస్తామన్నారు. కరీంనగర్ ఎంపీ లాడ్స్ నుంచి సింహభాగం మానకొండూర్ నియోజకవర్గ అభివృద్ధికి కేటాయించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ను కోరారు. నియోజవర్గానికి సంబంధించిన వివిధ అభివృద్ధి పనుల గురించి అడిగిన తడవుగానే నిదులు మంజూరు చేస్తున్నారని, అభివృద్ధి విషయంలో బండి తనదైన ముద్ర చూపిస్తున్నారని కవ్వంపల్లి కొనియాడారు. గన్నేరువరం నుంచి కరీంనగర్ వెళ్లేందుకు రహదారి మార్గం సరిగా లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రమాదంలో క్షతగాత్రులను, పాముకాటు గురైన వారిని, ప్రాణాపాయస్థితిలో ఉన్నవారిని చికిత్స నిమిత్తం కరీంనగర్ తరలించేందుకు దూరభారం ఎక్కువ కావడంతో సకాలంలో చేర్పించలేక ప్రాణాలు కోల్పోయిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయని ఆయన చెప్పారు.



గన్నేరువరం మండలం చొక్కారావుపల్లి నుంచి ఎల్గందల్ వరకు మానేరుపై వంతెన నిర్మించడం వల్ల 25 కిలో మీటర్ల దూరం తగ్గుతుందన్నారు. మానేరుపై వంతెన నిర్మించడం ద్వారా ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని, ఇందుకు అవసరమైన నిధులు గడ్కరీ ద్వారా మంజూరు చేయించాలని ఆయన కేంద్ర మంత్రి బండిని కోరారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ కె.శ్రీనివాస్ రెడ్డి, మండల అభివృద్ధి అధికారి విజయ్ కుమార్, పంచాయతీరాజ్ ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ మంజుల భార్గవి, ఓఈ సురేందర్ రెడ్డి, గ్రామ కార్యదర్శి శ్రీకాంత్, తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, పార్టీ నాయకులు సుధగోని లక్ష్మినారాయణగౌడ్, తుమ్మనపల్లి శ్రీనివాస్ రావు, కుంట రాజేందర్ రెడ్డి, కొత్త తిరుపతిరెడ్డి, బుధారపు శ్రీనివాస్, ఎస్.కొండల్ రావు, చింతల లక్ష్మారెడ్డి, గంకిడి లక్ష్మారెడ్డి, గొట్టెముక్కుల సంపత్ రెడ్డి, గుంటి భూమయ్య,పోలు రాము, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక వైద్యం మరింత బలోపేతం...








**• తోటపల్లి పీహెచ్సీ భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి**

**బెజ్జంకి,జూన్21(పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రాథమిక వైద్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మరింత బలోపేతం చేస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చెప్పారు. శనివారం బెజ్జంకి మండలం తోటపల్లి గ్రామంలో కోటి 56 లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజా వైద్యంపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, అందులో భాగంగానే అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఆస్పత్రుల్లో మందులు, వ్యాక్సీన్లు అందుబాటులో ఉంచిందన్నారు.ప్రాథమిక వైద్యాన్ని మరింత మెరుగుపర్చడమే కాకుండా వైద్య సేవలు మరింత విస్తరింపజేస్తోందన్నారు. ఈ క్రమంలోనే వైద్య,ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకున్నదని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలోప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కృష్ణతేజ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అక్కరవేణి పోచయ్య ముదిరాజ్, బెజ్జంకి దేవస్థానం చైర్మన్ జెల్ల ప్రభాకర్, పార్టీ నాయకులు అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, చిలివేరు శ్రీనివాస్ రెడ్డి, చెప్యాల శ్రీనివాస్ గౌడ్, బైర సంతోష్, పులి సంతోష్, ఆర్. మల్లికార్జున్, పర్స సంతోష్, బండపల్లి రాజు, రావుల నర్సయ్య, సందీప్, సాదిక్, మధుసూదన్ రెడ్డి, సంపత్ రెడ్డి, కుమార్, బండారి రమేశ్, తుమ్మనపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. **పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి:** మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం బెజ్జంకి మండలంలో సుడిగాలి పర్యటన జరిపారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. వడ్లూరు గ్రామంలో నిర్మించిన అంగన్వాడి నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు.అలాగే గాగిల్లాపూర్ గ్రామంలోని జడ్పీ హైస్కూల్లో నిర్మించిన సైన్స్ ల్యాబ్ గదిని ప్రారంభించారు. అంతే కాకుండా బెజ్జంకి మండల



కేంద్రంలోని మోడల్ స్కూల్లో సైన్స్ ల్యాబ్, కస్తూర్బా స్కూల్లో నిర్మించిన అదనపు తరగతి గదులను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు.**సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ:** బెజ్జంకి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చెక్కులు మంజూరు చేశారు. ఈ మండలానికి 16వ విడత కింద 55 మంది లబ్ధిదారులకు 17,59,400 రూపాయలు మంజూరు కాగా, శనివారం బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కుల రూపంలో అందజేశారు.

# అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**• అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**





**బయ్యారం,జూన్ 21(పిసిడబ్ల్యూ న్యూస్):** పేద బడుగు, బలహీన, అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం అని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తామని, దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు,రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,శనివారం మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం, కంబాలపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ కాపీల పంపిణీ, బయ్యారం మండల కేంద్రం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కోసం భూమి పూజ చేసి, గొల్లగూడెం బ్రిడ్జి , బీటీ రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన, కొత్తపేట గ్రామంలో 3 కోట్ల 25 లక్షలతో బాయ్స్ హాస్టల్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సంక్షేమం కోసం ఇందిరమ్మ ప్రభుత్వం ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తు ఉందని అన్నారు, గతం 10 సంవత్సరాలలో సొంత ఇంటి నిర్మాణం కోసం ఎలాంటి పథకాలు ప్రవేశపెట్టలేదని ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదవాడి సొంత ఇంటి కల సహకారం చేయడానికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పథకం ప్రవేశపెట్టి అర్హులైన ప్రతి ఒక్క పేదవారికి ఇండ్లు మంజూరు చేసి నిర్మించడం జరుగుతుందని అన్నారు, మొదటి విడతలో ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లతో పాటు వెయ్యి కలిపి 4500 ఇందిరమ్మ గృహాల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని,అనంతరం విడతల వారీగా ప్రతి ఒక్కరికి సొంత ఇంటిని నిర్మించి ఇవ్వడం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు,రైతు భరోసా పథకం కింద రైతులకు పెట్టుబడి సహాయం మంజూరు చేయడం రైతు రుణమాఫీ రైతు బీమా రైతు సంక్షేమం కోసం కృషి చేస్తుందని అన్నారు,ఆరు గ్యారెంటీ ల ద్వారా అన్ని వర్గాల అభివృద్ధికి ఈ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.బయ్యారం మండల కేంద్రంలో ఇందిరమ్మ లబ్ధిదారురాలు బరిగెల ఉపేంద్ర భర్త ఉపేందర్ ఇంటి నిర్మాణం కోసం భూమి పూజ చేసి వారికి నూతన వస్త్రలను అందజేశారు.మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్,ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యలు మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తమ నియోజకవర్గంపై ప్రత్యేక శ్రద్ధ వహించి అభివృద్ధికి సహకరించినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు, అదనపు కలెక్టర్లు స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టోప్పో, రెవెన్యూ కె వీరబ్రహ్మాచారి, రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణవేణి, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు,హరిప్రసాద్ అన్ని విభాగాల జిల్లా అధికారులు,సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.







## ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగం యోగ

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** యావత్తు ప్రపంచానికి భారతదేశం అందించిన మహోన్నత సాధనం యోగ అని అన్నారు. ఈ సందర్భంగా పటాన్చెరు సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన వారోత్సవాలను ఎమ్మెల్యే జిఎంఆర్ లాంచనంగా ప్రారంభించారు. విద్యార్థి దశనుండే మత్తు పదార్థాల వినియోగం, వాటి దుష్ఫలితాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రస్తుత సమాజంలో డ్రగ్స్ కల్చర్ ఎక్కువగా కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి పౌరుడు తన బాధ్యతగా డ్రగ్స్ కి వ్యతిరేకంగా పోరాటం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎక్కడైనా ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## ఏకలవ్య మోడల్ స్కూల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు

**- ప్రతి విద్యార్థిని,విద్యార్థులు యోగాను అనుసరించాలి**

**:సిరోల్ మండల తాహసిల్దార్ పున్నం చందర్**





**మహబూబాబాద్, జూన్ 21(పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** సిరోల్ మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు జరిగాయి.ఈ యొక్క వేడుకలకు సిరోల్ మండల తాహసిల్దార్ పున్నం చందర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ...యోగం యొక్క ప్రాముఖ్యత ఏమిటంటే, ఇది శారీరక, మానసిక , ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. యోగా సాధన చేయడం వల్ల వశ్యత, బలం, సమతుల్యత మరియు శ్వాస నియంత్రణ మెరుగుపడతాయి. అలాగే, ఒత్తిడి, ఆందోళన మరియు నిరాశను తగ్గించడంలో సహాయపడు తుంది. ప్రతి ఒక్క విద్యార్థిని, యోగను అనుసరించాలని అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో ఎంపీడీవో, ఉపాధ్యాయని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోర్టు ఆవరణలో యోగా దినోత్సవం

**హుజురాబాద్,జూన్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** హుజురాబాద్ కోర్టు సముదాయ ఆవరణలో కూడా యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి పద్మసాయి శ్రీ, ఏసీపీ మాధవి, సీఐ కరుణాకర్, బార్ అధ్యక్షులు యతిపతి అరుణ్ కుమార్, రమేష్, శ్రీనివాస్, రవీందర్ గౌడ్, సీహెచ్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. **హుజురాబాద్ సబ్ జైలులో ఖైదీల యోగా** అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని హుజురాబాద్ సబ్ జైలులో జైలర్ నాంపల్లి దేవేందర్ ఆధ్వర్యంలో ఖైదీలు యోగా చేశారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు కొన్ని రాజిరెడ్డి, ఎండీ రఫీ, నగదర్, దేవేందర్ రెడ్డి, రవీందర్, తిరుపతి పాల్గొన్నారు.



# జిన్నారంలో బీఆర్ఎస్ పార్టీ మహాధర్నా

● రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని బిఆర్ఎస్ డిమాండ్

● మాజీ మంత్రి హరీష్ రావు

● పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువనాయకులు మాదిరి ప్రిథ్వీరాజ్





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** పటాన్‌చెరు నియోజకవర్గంలోని జిన్నారం గ్రామంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రైతు భరోసా నిధుల విడుదల కోసం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు గారు, బీఆర్ఎస్ నాయకులు మాదిరి ప్రిథ్వీరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి శ్రీ కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతు భరోసా పథకం ద్వారా అర్హులైన రైతులకు నిధులు అందించాల్సిన సందర్భంలో, కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్ధత వల్ల నిధులు అందకపోవడం దురదృష్టకరం" అని అన్నారు. నిధుల జాప్యం వల్ల పేద రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని విమర్శించారు. జిన్నారం, అమీన్పూర్, పటాన్‌చెరు, రామచంద్రాపురం మండలాలకు ఇప్పటివరకు రైతు భరోసా నిధులు విడుదల కాలేదని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో నిధులు సమయానికి రైతుల ఖాతాల్లో జమ అయ్యేవి. కానీ ఇప్పుడేమో రైతులు అగౌరవానికి గురవుతున్నారు అన్నారు. ముఖ్యమంత్రి పదవిలో ఉండే వ్యక్తికి రైతుల బాధలు తెలియకపోవడం బాధాకరమని హరీష్ రావు మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా నిధులు ఇస్తామంటూ చెప్పి, పటాన్‌చెరు రైతులను పక్కన పెట్టడం అన్యాయం. రెండు లక్షల మంది రైతులు న్యాయం పొందకపోతే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలి అని అన్నారు. రైతు బంధు, రైతు బీమా, పింఛన్ల కోతపై కూడా ఆయన తీవ్ర విమర్శలు చేశారు. మార్పు తెస్తానన్న ముఖ్యమంత్రి ప్రతి పథకాన్ని ఎగవేసి ఏ మార్పు తెచ్చారో చెప్పాలి అని ప్రశ్నించారు. రైతులకు న్యాయం జరిగేంతవరకు బీఆర్ఎస్ ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. రైతు భరోసా నిధులు వెంటనే ఇవ్వకపోతే, బీఆర్ఎస్ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుంది. రైతు బంధు అందని రైతులు రింగ్ రోడ్ ఎక్కి ఉద్యమిస్తే, సీఎం గుండెలు అదరాలి అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీత లక్ష్మా రెడ్డి, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే మనిక్ రావు, పటాన్‌చెరు కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్, కొలన్ బాల్ రెడ్డి, సోమిరెడ్డి, వెంకటేష్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, నాయికోటి రాజేష్‌లు పాల్గొన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# అధికారంలో లేమని అధైర్యపడవద్దు

**బయ్యారం,జూన్ 21(పిసిడబ్ల్యూ న్యూస్):** అధికారంలో లేమని అధైర్యపడవద్దని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తాత గణేష్ అన్నారు. నేటీ పరిస్థితిల్లో బిఆర్ఎస్ పార్టీ అధికారంలో లేదని ఏ ఒక్క కార్యకర్త కూడా అధైర్యపడవద్దని రాబోయే రోజుల్లో రాష్ట్రంలో మళ్లీ బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని,స్థానిక సర్పంచ్,ఎంపీటీసీ,జడ్పీటీసీ ల ఎన్నికలు ఎప్పుడు వస్తే అప్పుడే పార్టీ విజయం కోసం ప్రతి ఒక్క కార్యకర్త నుండి మొదలుకొని గ్రామ,మండల, నియోజకవర్గ స్థాయి నాయకుల వరకు ధైర్యంగా ముందుకు సాగాలని, బయ్యారం మండలంలో సర్పంచ్, ఎంపీటీసీల స్థానాలను అధిక సంఖ్యలో గెలిపించే బాధ్యతను సవాలుగా తీసుకోవాలని,ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడు కుంటామని ఆయన కార్యకర్తల్లో మనోధైర్యం కల్పించారు. త్వరలో జరగబోయే సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో బయ్యారం మండలంలోని అన్ని పంచాయతీ ల్లో ప్రజలు బిఆర్ఎస్ పార్టీ కే ఓటు వెయ్యడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కనుమరుగవుతుందని,రాబోయే ఖరీఫ్ సీజన్ నుండి రైతు భరోసా పూర్తిగా రద్దు చేసే ప్రయత్నం జరుగుతుందని, వృద్దులకు,వితంతువులకు 4 వేల పెన్షన్,దివ్యాంగులకు 6 వేల పెన్షన్,మహిళలకు ప్రతీ నెల ఖాతాలో 2500 జమ,పెళ్ళైన ఆడపిల్లకు తులం బంగారం, పేదలకు పది లక్షల రూపాయల ఆరోగ్య భీమా,తెలంగాణ ఉద్యమ కారులకు 250గజాల ఇంటి స్థలం,గౌరవ భృతి,రైతులకు, కౌలు రైతులకు 15వేల రూపాయలు,రేషన్ డీలర్లకు 5వేలగౌరవ వేతనం లాంటి ఎన్నో హామీలు హామీలకే పరిమితమయ్యాయని,నాడు ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్క హామీ కూడా పూర్తిగా అమలు చేయడం లేదని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కనుమరుగౌతుందని అప్పటివరకు నాయకులు,కార్యకర్తలు సహనంతో ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.





# ఘనంగా సెక్రడ్ హార్ట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు







**ఖమ్మం, జూన్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి) :** ఖమ్మం రూరల్ మండలం దాన్వాయ్ గూడెం కాలనీ సెక్రడ్ హార్ట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు . 5000 సంవత్సరాల నుండిభారతదేశంలో ఉన్నజ్ఞానము యొక్క అంతర్భాగము . చాలా మంది యోగా అంటే శారీరక వ్యాయామము , కేవలంకొన్ని శారీరిక కదలికలు (ఆసనాలు) ఇంకా శ్వాస ప్రక్రియ అని మాత్రమే అనుకుంటారు . కానీ నిజానికి మానవుని యొక్క అనంతమైన మేధాశక్తి , ఆత్మశక్తిల కలయిక . యోగాతో ప్రశాంతత , విశ్రాంతి లభించడమే కాక మానసిక ఆరోగ్యమూ మెరుగవుతుంది . స్థిరమైన యోగాసనాల వల్ల శరీర అవయవాలకు , మనసుకు మధ్య సమన్వయం మెరుగై... ఏకాగ్రత పెరుగుతుంది . విద్యార్థులు రోజూ యోగా చేస్తే జ్ఞాపకశక్తి మెరుగై ... మెదడు చురుగ్గా పని చేస్తుంది . యోగాసనాల వల్ల రక్త ప్రసరణ మెరుగవుతుంది , శరీరం నుంచి వ్యర్థాలు వేగంగా బయటకు వెళ్లిపోతాయి , శారీరకపరమైన సాధనలతో కండరాలు దృఢంగా తయారవుతాయి , ప్రవర్తనలో మార్పు వస్తుంది , అతిగా తినాలని కానీ , చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా కాపాడుతుంది , సాధకునికి స్వీయ క్రమశిక్షణ అలవడుతుందని అన్నారు . ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ , ఉపాధ్యాయుని , ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు .

# పటాన్‌చెరు రైతులకు రైతు భరోసా జమ కాకపోవడంపై మంత్రులతో కాట శ్రీనివాస్ గౌడ్ భేటీ

● మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి దామోదర్ రాజనర్సింహలకు వినతిపత్రం అందజేసిన కాట శ్రీనివాస్ గౌడ్

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** పటాన్‌చెరు నియోజకవర్గంలో సుమారు 22,000 మంది అర్హులైన రైతులకు రైతు భరోసా నిధులు ఇప్పటికీ జమ కాకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేసిన కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్, ఈ సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహని సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు వ్యవసాయాన్ని నమ్ముకుని తమ జీవితం కొనసాగిస్తున్నారు. ఇలాంటి సమయంలో రైతు భరోసా నిధులు అందకపోవడం చాలా బాధాకరం. పటాన్‌చెరు నియోజకవర్గంలో 22,000 మంది రైతులు 43,000 ఎకరాలకు పైగా భూమిలో సాగు చేస్తున్నారు. వీరికి నిధులు అందకపోవడం వలన విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి అని వివరించారు. మంత్రులు ఈ విషయాన్ని గమనించి సానుకూలంగా స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి,అర్హులైన రైతులకు నిధులు వెంటనే జమ అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్, మాట్లాడుతూ రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ అధైర్య పడకండి. నిధులు అందేవరకు, అర్హులైన ప్రతి రైతుకు రైతు భరోసా వచ్చేలా కాంగ్రెస్ పార్టీ పూర్తి స్థాయిలో రైతుల పక్షాన నిలుస్తుంది.






## యోగాతో జీవిత గమనం మారుతుంది: మున్సిపల్ కమిషనర్

**హుజురాబాద్,జూన్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** మున్సిపల్ కమిషనర్ కేంసారపు సమ్మయ్య మాట్లాడుతూ, యోగా మన జీవిత గమనాన్ని మారుస్తుందని, యోగాను మన జీవితంలో ఒక భాగంగా మార్చుకోవాలని అన్నారు. టౌన్ సీఐ టి. కరుణాకర్, యోగా గురువు దేవునూరి శ్రీనివాస్, ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ ఎన్. నారాయణరెడ్డి, డాక్టర్ ప్రసాద్ రావు, డాక్టర్ రవీందర్ రావు, డాక్టర్ షబానా అజీజ్, మేనేజర్ భూపాల్ రెడ్డి, వాకర్స్ అధ్యక్షులు హరి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి మతిన్, ఉపాధ్యక్షుడు మండల యాదగిరి పాల్గొన్నారు.

## డిప్యూటీ డీఎంహెచ్ఓ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాలు




**హుజురాబాద్,జూన్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు గవర్నమెంట్ బాయ్స్ హైస్కూల్ గ్రౌండ్ ఆవరణలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చేల్పూర్‌లో జరిగిన యోగా వేడుకలకు ముఖ్య అతిథిగా డిప్యూటీ డీఎంహెచ్ఓ హుజురాబాద్ డాక్టర్ చందు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిరోజూ యోగా చేయడం ఆరోగ్యానికి చాలా ఉపకరిస్తుందని, హైపర్‌టెన్షన్, డయాబెటిస్ లాంటి రోగులకు యోగా మెడిటేషన్ ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతిరోజూ వచ్చే రోగులకు వైద్యాధికారులు, సిబ్బంది యోగాసనాల ప్రాముఖ్యత గురించి తెలియజేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మధు, డాక్టర్ జరీనా, విజేందర్ రెడ్డి, సమ్మయ్య, డాక్టర్ రవీందర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## మాధవ సేవా సమితి ఆధ్వర్యంలో యోగా దినోత్సవం....




**కరీంనగర్ టౌన్, జూన్ 21(పిసిడబ్ల్యూ న్యూస్):** అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని కరీంనగర్ మాధవ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక కోతిరాంపూర్ లోని గిద్దె పెరుమాళ్ళ గ్రౌండ్ లో ఉదయం యోగా దినోత్సవం నిర్వహించారు. యోగాచార్యులు వనమాల రాజేశ్వర్ యోగా యొక్క నిర్వచనాన్ని, ప్రాముఖ్యతను తెలియజేశారు. యోగ అనేది అష్టాంగములు, యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధిలతో కూడినదన్నారు. యోగ అనేది మనసు, బుద్ధి, శరీరం ఈ మూడింటిని ఏకీకృతం చేసి ఆత్మలో పరమాత్మను కలపడమే యోగ అని తెలిపారు. యోగా సాధనలో ముఖ్యమైన సూర్య నమస్కారాలు, ఆసనాలు, ముద్రలు, ప్రాణాయామంలను చేయించారు. మాధవ సేవా సమితి అధ్యక్షులు సి ఎ, డి నిరంజనాచారి మాట్లాడుతూ.. యోగా మన జీవితంలో ఒక భాగమని, మనకు ఉన్నంతలో ఆరోగ్యం పై శ్రద్ధ నియమాలు పాటిస్తూ జీవితాన్ని ఆనందమయంగా మనమే మలుచుకోవాలని చెప్పారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ విభాగ కార్యవాహ ఆదరణీయ పాక సత్యనారాయణ, పురప్రముఖులు, మాధవ సేవా సమితి అధ్యక్షు లు, కార్యదర్శి కామారపు ప్రసాద్, సంయుక్త కార్యదర్శి నగునూ రి చంద్రశేఖర్, సమితి సభ్యులు సంఘ కార్యకర్తలు పాల్గొన్నారు.





## ప్రభుత్వ పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవము

**మేడ్చల్ జూన్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవమును పీఎం శ్రీ జెడ్పిహెచ్ఎస్ మేడిపల్లి నందు యోగ గురువు సమక్షములో ఘనంగా నిర్వహించడము జరిగింది. ప్రదానోపాద్యాయులు ఎల్. సత్యప్రసాద్, ఉపాధ్యాయ బృందము పాల్గొని విద్యార్థులను ఉత్తేజ పరిచారు. ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్ మాట్లాడుతూ... నిత్య జీవితంలో యోగా ఆవశ్యకత గురించి వివరించి విద్యార్థులు దైనందిక కార్యక్రమంలో యోగాను అబ్యాసంచేసి అలవాటు గా పెంపొందించుకోవాలని సూచించారు.

## నకిలీ పత్తి విత్తనాల సమస్యకి పరిష్కారం

- విత్తన శుద్ధి తదితర అంశాలపై వ్యవసాయ,రైతు సంక్షేమ శాఖ చైర్మెన్ కోదండ రెడ్డితో సంపత్ కుమార్ ప్రత్యేక సమావేశం
- అలంపూర్ నియాజక వర్గం అయిజలో నూతన మార్కెట్ యార్డు ఏర్పాటు చేయాలని విన్నపం



**అయిజ,జూన్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** నేడు తెలంగాణ వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ కార్పొరేషన్ చైర్మెన్ కోదండ రెడ్డి ని కలిసిన,అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్,అలంపూర్ నియోజక వర్గంలో రైతులు అత్యధికంగా ఉండటం వల్ల అలంపూర్ మార్కెట్ యార్డు సరిపోవడం లేదు,కనుక అయిజ లో నూతన మార్కెట్ యార్డు ఏర్పాటు చేయాలని కోరిన,ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే ఎస్.ఏ.సంపత్ కుమార్ ఈ సమావేశంలో సంపత్ కుమార్ గద్వాల జిల్లా గ్రంథాలయ చైర్మెన్ నీలి శ్రీనివాస్,వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మద్దిలేటి మాజీ ఎంపీటీసీ,యువరాజు,తదితరులు ఉన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

**- కాటారం డీఎస్పీ సూర్యనారాయణ**

**కాటారం,జూన్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** మండల కేంద్రంలోని ఆదర్శ హైస్కూల్ లో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాటారం డీఎస్పీ సూర్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, యోగ సాధకులతో కలిసి యోగా ఆసనాలు, మెడిటేషన్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ యోగా శరీరానికి ఆరోగ్యాన్ని, మనసుకు ప్రశాంతతను అందిస్తుందన్నారు. ప్రతిరోజూ యోగాను అలవాటు చేసుకోవడం ద్వారా శారీరక మానసిక ధైర్యాన్ని పొందవచ్చన్నారు. ప్రతి ఒక్కరు యోగాను తమ దైనందిన జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలన్నారు. విద్యార్థులు, యువత చెడు వ్యసనాల బారిన పడకుండా సన్మార్గంలో ముందుకెళ్లాలని అన్నారు. క్రమశిక్షణతో ఉంటూ ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు నిరంతరం శ్రమించాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన వివిధ యోగా ఆసనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఆదర్శ విద్యాసంస్థల చైర్మన్ జనగామ కరుణాకర్ రావు, కరస్పాండెంట్ కార్తీక్ రావు, ప్రిన్సిపాల్ కృషిత, నాయకులు, యోగ సాధకులు కుమార్, వనిత, రవీందర్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.






## యోగాతో మానసిక ప్రశాంతత

- హుజురాబాద్‌లో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహణ

**హుజురాబాద్,జూన్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** నేటి యాంత్రిక జీవితంలో ఆరోగ్యం కోసం ప్రతి వ్యక్తి తప్పనిసరిగా ఆలోచించాల్సిన అవసరం ఉందని, యోగాతో అందం, ఆనందం, ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తాయని హుజురాబాద్ ఏసీపీ వాసంశెట్టి మాధవి అన్నారు. శనివారం హుజురాబాద్ పట్టణంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. **హుజురాబాద్‌లో విస్తృతంగా యోగా వేడుకలు** హుజురాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం, కోర్టు సముదాయ భవనం, సబ్ జైలు, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, చేల్పూర్ ఉన్నత పాఠశాల, సింగపూర్ కిట్స్ కాలేజీలలో, అలాగే బీజేపీ, వికాస తరంగిణి, డిప్యూటీ డీఎంహెచ్ఓ ఆధ్వర్యంలో ఈ యోగా వేడుకలు నిర్వహించారు. **ఏసీపీ మాధవి సందేశం** ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన కార్యక్రమంలో ఏసీపీ మాధవి మాట్లాడుతూ, భగవంతుడు ప్రసాదించిన మానవ జన్మలో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, ఆరోగ్యానికి మించిన ధనం లేదని ఉద్ఘాటించారు. ఒక వ్యక్తి అనారోగ్యానికి గురైతే, ఆ వ్యక్తితో పాటు కుటుంబ సభ్యులు కూడా ఆర్థికంగా, మానసికంగా, ఆరోగ్యపరంగా నష్టపోతారని ఆమె అన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ యోగాను జీవన విధానంలో భాగం చేసుకోవాలని, అప్పుడే ప్రతి మనిషి ఆరోగ్యంగా ఉండగలుగుతారని సూచించారు.

## భారతదేశం యోగాను ప్రపంచానికి ఆధ్యాత్మిక వారసత్వంగా అందించింది

- బీజేపీ పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు





**హుజురాబాద్,జూన్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారతీయ జనతా పార్టీ హుజురాబాద్ పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు ఆధ్వర్యంలో శనివారం హుజురాబాద్ డీసీఎంఎస్ కాంప్లెక్స్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. భారతీయ సనాతన ధర్మం ప్రపంచానికి అందించిన అపురూప కానుక యోగా అని, యోగా ద్వారా మనస్సు, శరీరాన్ని ఏకం చేస్తుందని, శారీరక దృఢత్వాన్ని, మానసిక శాంతిని, ఆత్మశుద్ధిని చేస్తుందని, అనేక రుగ్మతలను తొలగిస్తుందని తెలిపారు. యోగాను ప్రతిరోజూ అలవర్చుకోవాలని ఆయన తెలియజేశారు. ప్రధాని నరేంద్ర మోడీ యోగాను విశ్వవ్యాప్తం చేసి, నేడు దాదాపు 190కి పైగా ప్రపంచ దేశాలు యోగాను అనుసరిస్తున్నాయని అన్నారు. చైనా, అమెరికా, జపాన్ వంటి దేశాలు తమ పాఠశాలల్లో యోగాను ప్రవేశపెట్టాయని పేర్కొన్నారు. 'వన్ ఎర్త్ వన్ హెల్త్', ప్రపంచ శాంతిని, ప్రపంచం మొత్తం ఆరోగ్యంగా ఉండాలని కోరుకునేది భారతదేశం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు శ్రీనివాస్ రెడ్డి, కొమురవెల్లి సదానందం, కళ్లెపు సుధాకర్ రావు, మెరుగు రాజిరెడ్డి, కార్యక్రమ కన్వీనర్ గంగిశెట్టి ప్రభాకర్, మాజీ కౌన్సిలర్ పైళ్ల వెంకటరెడ్డి, నల్ల సుమన్, కార్యక్రమ కో-కన్వీనర్ బోరగల సారయ్య, కొలిపాక వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు తూముల శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ మెంబర్ రావుల వేణు, సీనియర్ కొలిపాక శ్రీనివాస్, నాయకులు తిప్పబత్తిని రాజు, యాల సంజీవరెడ్డి, సబ్బని రమేష్, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షులు గంట సంపత్, మునిగంటి నాగరాజు, విక్రమ్, గంధం సంతోష్, తూర్పాటి సునీల్, అనిల్, బూతం సాయిరాం, శ్రీరంగం, ఇలాసాగరం వీరస్వామి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రైతులకు ఉద్యాన పంటలు, పథకాలపై అవగాహన సదస్సు





**హుజురాబాద్,జూన్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖల ఆధ్వర్యంలో శనివారం హుజురాబాద్‌లోని రైతు వేదికలో రైతులకు ఉద్యాన పంటలు, వాటి సంబంధిత పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రైతులకు అధిక దిగుబడులు, ఆదాయం పెంపొందించే మార్గాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి రావిలాల శ్రీనివాస్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పండ్లు, కూరగాయలు, పూలు, సుగంధ ద్రవ్యాలైన పసుపు, అల్లం వంటి ఉద్యాన పంటల ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని, అలాగే ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు వివరించారు. జమ్మికుంట కే.వి.కె. శాస్త్రవేత్త జి. వేణుగోపాల్ బంతి, మల్లె, అరటి, బొప్పాయి, గులాబీ పూల సాగు పద్ధతులపై విలువైన సమాచారాన్ని అందించారు. హుజురాబాద్ ఏ.ఓ. సి. భూమిరెడ్డి మాట్లాడుతూ, రైతులు పంట మార్పిడి చేసుకోవడం ద్వారా నేల సారాన్ని పెంచుకోవచ్చని, తద్వారా అధిక లాభాలు పొందవచ్చని సూచించారు. హుజురాబాద్ ఉద్యాన అధికారిణి బి. మంజువాణి రైతులు ప్రభుత్వం అందిస్తున్న ఉద్యాన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, వాటికి దరఖాస్తు చేసుకునే విధానాన్ని వివరించారు. ఏ.డి. సెరికల్చర్ రషీద్ పట్టు పురుగుల పెంపకం, దాని ప్రయోజనాల గురించి తెలియజేశారు. ఈ సదస్సులో ఏ.ఈ.ఓ.లు నిఖిల్, అనూష, సౌమ్య, స్రవంతి, ఎఫ్.పి.ఓ. ప్రెసిడెంట్ శ్రీనివాస్, ఆయిల్ పామ్ మేనేజర్ హరీష్, ఫీల్డ్ ఆఫీసర్ వేణుతో పాటు హుజురాబాద్ డివిజన్‌లోని వివిధ గ్రామాల నుండి వచ్చిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ గోల్డెన్ శాతవాహన నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం..





**కరీంనగర్ టౌన్, జూన్ 21(పిసిడబ్ల్యూ న్యూస్):** లయన్స్ ఆఫ్ కరీంనగర్ గోల్డెన్ శాతవాహన 2025-2026 సంవత్సరంనకు గాను నూతన కార్యావర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది, ఈ కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి 320G సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ మోర భద్రేశం ముఖ్య అతిథి మరియు ఇన్స్టలేషన్ అధికారిగా వ్యవహారించారు.వారు మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ 210 దేశాలలో విస్తరించి ఉన్నదని అవసరార్థులను గుర్తించి, వారి అవసరాలను తీర్చాలని, క్లబ్ లక్ష్యాలైన పర్యావరణ పరిరక్షణ, యూత్ ఎంపవర్మేట్, విజన్ కేర్, హంగర్ రిలీఫ్, ఉమెన్ ఎంపవర్మెంట్ మొదలగు వాటిని పేద ప్రజలకు అందించాలని సూచించి, నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన అధ్యక్షులుగా లయన్ ననువాల గిరిధర్ రావు, కార్యదర్శిగా లయన్ పాశం నర్సింహారెడ్డి, కోశాధికారిగా లయన్ డా. కుంభోజు రమేష్, ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ గా లయన్ చిలు పూరి రాములు, సెకండ్ వైస్ ప్రెసిడెంట్ గా లయన్ మమత వేణు, క్లబ్ డైరెక్టర్లు, సభ్యులు ఎన్నికై ప్రమాణ స్వీకారం చేశారు. ఇమ్మీడియేట్ పాస్ట్ ప్రెసిడెంట్ లయన్ మానువాడ శంకర్, పాస్ట్ ప్రెసిడెంట్ లయన్ అక్కినపల్లి అజయ్ కుమార్, డిస్ట్రిక్ట్ కాబినెట్ ట్రెజరర్ లయన్ గాలిపెల్లి వెంకట్, జోన్ ఛైర్పర్సన్ లయన్ శశికాంత్ వర్మ, మీల్స్ ఆన్ వీల్స్ జిల్లా కో ఆర్డినేటర్ లయన్ రావికంటి కృష్ణ కిషోర్, లయన్ పురుషోత్తం సతీష్, లయన్ బండారి గంగాధర్, లయన్ ఆరెపల్లి సంపత్, లయన్ అలిశెట్టి శ్రీనివాస్, లయన్ ఉదారపు వెంకటస్వామి, లయన్ శ్రీరామోజు దేవేందర్, లయన్ సైండ్ల బాలయ్య, లయన్ ననువాల హరిప్రియ, లయన్ మానువాడ వనజ, లయన్ అక్కినపల్లి లక్ష్మి, లయన్ కుంబోజు సమత, లయన్ పాశం సత్య, లయన్ చిలుపూరి జ్యోతి లయన్ సభ్యులు పాల్గొన్నారు.





## నా బాడీ నా ఇష్టం : శృతిహాసన్



కమల్ హాసన్ గారాల పట్టి శృతి హాసన్ ఎంత స్ట్రైట్ ఫార్వార్డ్ అనేది ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తనకు సంబంధించిన ఏ విషయం అయిన నిర్మొహమాటంగా చెప్పేస్తుంది. మల్టీ టాలెంటెడ్ అయిన శృతి హాసన్ టీనేజ్‌లో ఉన్నప్పుడే సింగర్‌గా కెరీర్‌ను మొదలు పెట్టింది. ఆ తర్వాత స్వయంగా ఎన్నో ఆల్బమ్‌లను కూడా రూపొందించింది. ఈ క్రమంలోనే 'హే రామ్' అనే చిత్రంలో చిన్న పాత్రతో నటిగా ఎంట్రీ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ లక్ అనే హిందీ చిత్రంలో నిపించింది. ఇక, తెలుగులో వచ్చిన 'అనగనగా ఓ ధీరుడు'తో శృతి హీరోయిన్‌గా జర్నీని స్టార్ట్ చేసింది. అయితే పవన్ కళ్యాణ్ సరసన నటించిన గబ్బర్ సింగ్ చిత్రం శృతి హాసన్ ఫేట్‌ని మార్చేసింది అని చెప్పాలి. కుర్ర హీరోలతోనే కాకుండా సీనియర్ హీరోలతో కూడా శృతి హాసన్ సినిమాలు చేస్తుంది. ఆ మధ్య ప్రభాస్‌తో 'సలార్', బాలకృష్ణతో 'వీరసింహారెడ్డి', చిరంజీవితో 'వాల్తేరు వీరయ్య' మూవీలతో హ్యాట్రిక్ హిట్లు కొట్టింది. త్వరలో సలార్2తో సందడి చేయనుంది. అయితే కెరీర్ పరంగా శృతికి పెద్ద సమస్యలేమి లేవు కాని పర్సనల్ లైఫ్‌లోనే డిస్ట్రబెన్స్ ఎక్కువ అవుతుంది. అప్పట్లో విదేశీ గాయకుడు మైకేల్ కోర్సలేతో డేటింగ్ చేసిన ఈ అమ్మడు అతడిని కమల్ హాసన్‌కు పరిచయం కూడా చేసింది. దాంతో శృతి హాసన్, మైకేల్ కోర్సలే పెళ్లి చేసుకుంటారని అంతా అనుకోగా, కొద్ది రోజులకే వీళ్లు బ్రేకప్ చెప్పుకున్నారు.మైకేల్‌తో విడిపోయిన తర్వాత శృతి హాసన్.. డూడుల్ ఆర్టిస్టు అయిన శాంతను హజారికాతో ప్రేమాయణం కొనసాగించింది. అతడితో ఎంజాయ్ చేసిన ఫొటోలు అన్ని కూడా సోషల్ మీడియాలో షేర్ చేసేది. అతడితో రొమాంటిక్‌గా గడిపింది. కాని ఎందుకో ఏమో శాంతనుకు శృతి హాసన్ బ్రేకప్ చెప్పేసింది. అయితే తాజాగా శృతి హాసన్ ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర కామెంట్స్ చేసింది. టీనేజ్ లో ఉన్నప్పుడు నా ముక్కు నాకు నచ్చకపోవడంతో 'సర్జరీ' చేయించుకున్నాను అని తెలిపింది. ఇక ముఖం మరింత అందంగా కనిపించేందుకు పిల్లర్స్ కూడా వాడాను. కొంత మంది వీటిని బయటకి చెప్పుకోవడానికి ఇష్టపడరు. కానీ నేను అలా కాదు నా నాబాడీ నా ఇష్టమన్నారు శృతిహాసన్.

## పెళ్లి తర్వాత మెగా కొడలి మొదటి సినిమా

మెగా కోడలు లావణ్య త్రిపాఠి పెళ్లి తర్వాత కొన్ని రోజులు సినిమాలకు బ్రేక్‌నిచ్చిన విషయం తెలిసిందే. 2023లో వరుణ్ తేజ్‌తో కలిసి వివాహ బంధంలో అడుగుపెట్టిన లావణ్య సుమారు ఏడాదిపాటు సినిమాలకు గ్యాప్ ఇచ్చింది. అయితే పెళ్లి తర్వాత మెగా కోడలిగా రీ ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలిపింది. లావణ్య ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం సతీ లీలావతి(). భీమిలీ కబడ్డీ జట్టు సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న తాతినేని సత్య ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. దుర్గాదేవి పిక్చర్స్, ట్రియో స్టూడియోస్ పతాకాలపై నాగమోహన్ బాబు.ఎమ్, రాజేష్.టి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ నుంచి ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు మేకర్స్. ఈ ఫస్ట్ లుక్‌లో లావణ్య కోపంతో అరుస్తున్నట్లు కనిపిస్తుంది. అయితే మూవీ భార్య భర్తలమధ్య ఉన్న అనుబంధం ఆధారంగా ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. మలయాళ నటుడు దేవ్ మోహన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీకి మిక్కీ జె. మేయర్ సంగీతం అందిస్తుండగా, సినిమాటోగ్రాఫర్‌గా బినేంద్ర మీనన్, ఎడిటింగ్ బాధ్యతలను సతీష్ సూర్య చేపడుతున్నారు. మరోవైపు లావణ్య- వరుణ్ దంపతులు త్వరలోనే తల్లిదండ్రులం కాబోతున్నట్లు ఇటీవల ప్రకటించారు.

## కుబేరా సినిమాపై శేఖర్ కమ్ముల స్పందన ఇలా




దర్శకుడు శేఖర్ కమ్ముల రూపొందించిన 'కుబేరా' చిత్రం శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. ధనుష్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రంలో రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటించగా.. నాగార్జున, జిమ్ సర్భ్ ప్రత్యేక పాత్రల్లో నటించారు. ఈ సినిమా చూసిన అభిమానులు చాలా రోజుల తర్వాత తెలుగులో ఒక మంచి సినిమా వచ్చింది అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. అయితే ఈ సినిమాకు వచ్చిన రెస్పాన్స్ సందర్భంగా చిత్రయూనిట్ నేడు సక్సెస్‌మీట్‌ను ఏర్పాటు చేసింది. మీట్‌లో నాగార్జునతో పాటు దర్శకుడు శేఖర్ కమ్ముల పాల్గొని కుబేరని హిట్ చేసినందుకు ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు. అయితే ఈ సినిమా రన్‌టైం (181 నిమిషాలు) ఎక్కువగా ఉందని సోషల్ మీడియాలో కామెంట్లు వినిపిస్తున్న విషయం తెలిసిందే. సినిమా రన్‌టైం కాస్త తగ్గించి ఉంటే బాగుండేదని టాక్ వినిపిస్తుంది. అయితే ఈ విషయంపై తాజాగా స్పందించారు శేఖర్ కమ్ముల. కుబేర రన్‌టైం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈ సినిమా కథ అనుకున్నప్పటి నుంచి రియాలిటీకి దగ్గరగా తీయాలి అనుకున్నాం. అందుకే అల తెరకెక్కించాం. ఈ సినిమా రన్‌టైం విషయంలో కామెంట్స్ వినిపిస్తున్న మాటా నిజమే కానీ. ఎంతవరకు కత్తిరించాలో.. ఎంత చూపించాలి అనేది దర్శకుడికి అతడి టీమ్‌కి తెలియనిది కాదు. అందుకే సినిమాను కత్తిరించకుండా ఉంచాం. అప్పుడే సినిమాకి న్యాయం చేసినట్లు ఉంటుంది. ప్రేక్షకులకు సినిమా నచ్చితే రన్‌టైం గురించి ఆలోచించరంటూ శేఖర్ చెప్పుకోచ్చాడు.

## వరుస సినిమాలతో ప్రియాంక మోహన్ బిజీ



ప్రియాంక మోహన్.. స్టార్ హీరోలతో వరుసగా సినిమాలు చేస్తోంది ఈ అమ్మడు. పేరుకు మలయాళ నటినే అయినా పక్కింటమ్మాయిలా కనిపిస్తూ తెలుగు ఆడియెన్స్ కు బాగా చేరవవుతోంది. తన అందం, అభినయంతో టాలీవుడ్ లో క్రమంగా స్టార్ హీరోయిన్ గా ఎదుగుతోంది. కెరీర్ ప్రారంభంలోనే నాని, శర్వానంద్ లాంటి ప్రామిసింగ్ హీరోలతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకుంది. ఈ అందాల తార ఇప్పుడు ఏకంగా పవర్ స్టార్ పవన్ కల్యాణ్ సినిమాలో హీరోయిన్ ఛాన్స్ కొట్టేసింది. స్టైలిష్ డైరెక్టర్ సుజిత్ తెరకెక్కిస్తోన్నతెరకెక్కిస్తోన్న ఓజీలో ఈ బ్యూటీనే మెయిన్ హీరోయిన్ గా ఎంపికైంది ప్రియాంక మోహన్. చివరిగా సరిపోదా శనివారంతో బ్లాక్ బస్టర్ మూవీని ఖాతాలో వేసుకుంది ప్రియాంక అరుళ్ మోహన్. సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ యాక్టివ్ గా ఉండే ఆమె రెగ్యులర్ గా ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. మొన్నటివరకు గ్లామర్ డోస్ కు దూరంగా ఉండే ఈ అమ్మడు ఇప్పుడు తన బ్యూటీ ఫుల్ ఫోటోలతో అభిమానులను మెప్పిస్తుంది. 2019లో కన్నడ సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది ప్రియాంక మోహన్. అదే సంవత్సరం న్యాచురల్ స్టార్ నాని 'గ్యాంగ్ లీడర్' సినిమాతో తెలుగు సినిమాకు పరిచయమైందీ అందాల తార. ఆతర్వాత శర్వానంద్ తో శ్రీకారం సినిమాలో నటించింది. ఆతర్వాత టాలీవుడ్ లో గ్యాప్ ఇచ్చింది. తాజాగా ఈ అమ్మడు సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు అభిమానులను కవ్విస్తున్నాయి. చీరకట్టులో అందాలు ఒలకబోస్తూ క్రేజీ ఫోటోలను పంచుకుంది. ఈ ఫోటోల పై నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. అమ్మడి అందాలను పొగుడుతూ కామెంట్స్ చేస్తున్నారు.

## నిర్మాతగా రామ్ పోతినేని..!



హీరోలు నిర్మాతలు అయినంత తేలికగా నిర్మాతలు హీరోలు కాలేరు. కానీ అప్పుడప్పుడు టెక్నీషియన్స్ కూడా హీరోలుగా తమ అదృష్టం పరీక్షించుకుంటూ ఉంటారు. నిజానికి దర్శకులు చాలామంది తమకు నచ్చిన కథను నిర్మాతగా మారితేనే చేయగలమనే నమ్మకంతో ప్రొడ్యూసర్స్ అవుతుంటారు. హీరోలు కూడా తమకు నచ్చిన దర్శకుడిని, నచ్చిన కథను తెర మీద చూసుకోవడానికి నిర్మాతలుగా మారుతుంటారు. అయితే కొందరు కేవలం తామే హీరోలుగా నటించడం కాకుండా కథానుగుణంగా యంగ్ టాలెంట్ నూ ప్రోత్సహిస్తూ ఉంటారు. నాని అలా 'అ', 'హిట్' చిత్రాలను నిర్మించాడు. 'హిట్ -3'లో తానే హీరోగా చేశాడు. విజయ్ దేవరకొండ కూడా తనతో 'పెళ్ళిచూపులు' సినిమా తెరకెక్కించిన దర్శకుడు తరుణ్ భాస్కర్ హీరోగా 'మీకు మాత్రమే చెబుతా' మూవీని తీశాడు. తాజాగా యంగ్ హీరో ఉస్తాద్ రామ్ పోతినేని సైతం నిర్మాతగా మారబోతున్నాడని తెలుస్తోంది. ప్రస్తుతం రామ్ కు గడ్డు కాలం నడుస్తోంది. అతని చిత్రాలన్నీ బాక్సాఫీస్ బరిలో వరుసగా ఫెయిల్ అవుతున్నాయి. 'స్కంద, డబుల్ ఇస్మార్ట్' పరాజయాల నుండి కాస్తంత కోలుకున్న రామ్ ఇప్పుడు 'ఆంధ్రా కింగ్ తాలుకా' సినిమాలో నటిస్తున్నాడు. ఆంధ్రా కింగ్ గా ఉపేంద్ర నటిస్తున్న ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్. 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' ఫేమ్ మహేశ్ బాబు దీనికి దర్శకుడు. ఈ సినిమా కోసం రామ్ గీత రచయితగానూ మారాడు. అలానే త్వరలో నిర్మాత అవుతున్నాడని సమాచారం. విశేషం ఏమంటే... ఇప్పటికే తెలుగు సినిమా రంగంలో రామ్ పెద్దనాన్న రవికిశోర్ 'స్రవంతి మూవీస్' పేరుతో సినిమాలు నిర్మిస్తున్నారు. రామ్ తోనే కాకుండా ఆయన బయటి హీరోలతోనూ సినిమాలు తీస్తున్నారు. అయితే... పెదనాన్న నీడలో కాకుండా తన అభిరుచికి తగ్గట్టుగా సినిమాలు నిర్మించాలని రామ్ భావించాడట. అందుకే ఓన్ బ్యానర్ పెట్టబోతున్నాడని తెలిసింది. తొలి చిత్రం ద్వారా ఓ కొత్త దర్శకుడిని రామ్ పరిచయం బోతున్నాడట. అయితే ఈ సినిమాలో రామ్ నటిస్తాడా వేరే వాళ్ళతో కేవలం మూవీ మాత్రం నిర్మిస్తాడా అనేది తెలియాల్సి ఉంది. 'ఆంధ్రా కింగ్ తాలుకా' మూవీ విడుదలైన తర్వాత ఓన్ బ్యానర్ కు సంబంధించిన ప్రకటన వస్తుందని తెలుస్తోంది.